




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 1 సంచిక : 100 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) పచురణ : తాడేపల్లిగూడెం శుక్రవారం 20 ఫిబ్రవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 100 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : THADEPALLI GUDEM FRI 20 FEBRUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur




## నకిలీ వెబ్‌సైట్ల మాయాజాలం...

### సజ్జనార్ నుంచి మరో అలర్ట్

- సెర్చ్ ఇంజిన్ ర్యాంకింగులను వాడుకుని పెరిగిపోతున్న సైబర్ మోసాలు
- ప్రభుత్వ, బ్యాంకింగ్ వెబ్‌సైట్లను పోలిన నకిలీ సైట్లతో వినియోగదారులకు వల
- వివరాలు నమోదు చేస్తే ఖాతాలు ఖాళీ అయ్యే ప్రమాదం ఉందని హెచ్చరిక
- యూఆర్ఎల్ సరిచూసుకోవాలని, స్పాన్సర్డ్ లింకులపై అప్రమత్తంగా ఉండాలని సూచన
- మోసపోతే వెంటనే 1930కి కాల్ చేయాలని ప్రజలకు పోలీసుల విజ్ఞప్తి

- మిగతా 2లో



## విశాఖలో వేడుకగా 'ఇంటర్నేషనల్ సిటీ పరేడ్'

- విశాఖ ఆర్కే బీచ్‌లో ఘనంగా అంతర్జాతీయ సిటీ పరేడ్
- భారత దళాలతో పాటు పలు దేశాల నావికాదళాల కవాతు
- అబ్బురపరిచిన వైమానిక విన్యాసాలు, కమాండోల ప్రదర్శనలు
- ముఖ్య అతిథిగా పాల్గొన్న గవర్నర్ అబ్దుల్ నజీర్
- వివిధ దేశాల సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి

2లో



# ఇది బాబు భజన.. అన్నీ తప్పుడు లెక్కలే

## ఏపీ బడ్జెట్‌పై జగన్ విమర్శలు



- ఏపీ బడ్జెట్ అబద్ధాలు, తప్పుడు లెక్కలమయం అని జగన్ విమర్శ
- సూపర్ సిక్స్ హామీలను గాలికి వదిలేశారని ప్రభుత్వంపై ఆరోపణ
- రాష్ట్ర ఆదాయం బాబు అండ్ కో జేబుల్లోకి వెళుతోందని ఘాటు వ్యాఖ్యలు
- సొంత ఆదాయాల వృద్ధిలో ఏపీ 22వ స్థానంలో ఉందని వెల్లడి
- నారా లోకేశ్ పైనా తీవ్ర స్థాయిలో జగన్ ధ్వజం

పెన్ పవర్ డెస్క్:వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఇది ప్రజల బడ్జెట్ కాదని, కేవలం చంద్రబాబు భజన, తప్పుడు లెక్కలతో నిండిన మోసపూరిత పత్రమని ఆయన అభివర్ణించారు. గురువారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ప్రభుత్వ తీరును ఎండగట్టారు. "మోసానికి షర్టు, ప్యాంటు వేస్తే అది చంద్రబాబే. అబద్ధానికి రెక్కలు కడితే అది కూడా చంద్రబాబే" అంటూ జగన్ ఘాటు వ్యాఖ్యలతో ప్రసంగాన్ని ప్రారంభించారు. చంద్రబాబు పాలన "పబ్లిసిటీ పీక్.. పర్ఫామెన్స్ వీక్" అన్న చందంగా ఉందని ఎద్దేవా చేశారు. ఎన్నికల ముందు ఊదరగొట్టిన సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీలను మూడు బడ్జెట్‌లలోనూ గాలికి వదిలేసి అన్ని వర్గాల ప్రజలను వెన్నుపోటు పొడుస్తున్నారని ఆరోపించారు. ఆర్థిక లెక్కలన్నీ తప్పుల తడకలేనని జగన్ అంకెలతో సహా వివరించారు. 2024-25లో రూ.1.19 లక్షల కోట్ల ఆదాయం వస్తుందని చెప్పి, వాస్తవానికి రూ.94,937 కోట్లు మాత్రమే రాబట్టారని తెలిపారు. పది నెలల్లో రాష్ట్ర ఆదాయ వృద్ధి కేవలం 4.25 శాతమేనని పేర్కొన్నారు. కాగ్ రిపోర్ట్ ప్రకారం, దేశంలోని 23 రాష్ట్రాల్లో సొంత ఆదాయాల పురోగతిలో ఏపీ చివరి నుంచి రెండో స్థానంలో (22వ ర్యాంక్) ఉందని, ఇది ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని విమర్శించారు. ఇలాంటి పరిస్థితుల్లో 2026-27 నాటికి ఆదాయం 45% పెరుగుతుందని చెప్పడం హాస్యాస్పదమన్నారు. ప్రభుత్వ అసమర్థత వల్లే రాష్ట్ర ఆదాయం 'బాబు అండ్ కో' జేబుల్లోకి వెళ్తోందని, "దోచుకో.. దాచుకో.. పంచుకో" అనే విధానం అమలవుతోందని జగన్ ఆరోపించారు. అప్పుల వివరాలను బడ్జెట్‌లో చూపించకపోవడం

- మిగతా 2లో

## నేడు ఢిల్లీకి సీఎం చంద్రబాబు..

## ఏఐ ఇంపాక్ట్ సదస్సులో కీలక ఒప్పందాలు!



- ఏపీని టెక్నాలజీ హబ్‌గా మార్చే లక్ష్యంతో సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటన
- ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026లో పాల్గొననున్న ముఖ్యమంత్రి
- ఐబీఎం, ఐఐటీ మద్రాస్, ఎన్విడియా వంటి దిగ్గజ సంస్థలతో కీలక ఒప్పందాలు
- 10 లక్షల మంది యువతకు ఏఐ, క్వాంటం టెక్నాలజీలో నైపుణ్య శిక్షణ
- కేంద్ర మంత్రులు, పారిశ్రామికవేత్తలతో సమావేశం కానున్న చంద్రబాబు

- మిగతా 2లో

## కాలేజీలు, స్కూళ్లకు ఏఐని అందుబాటులోకి తీసుకొస్తాం

### కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్

- ఏఐ పటంలో భారత్ ను నాయకుడిగా నిలబెట్టడమే లక్ష్యమన్న అశ్విని వైష్ణవ్
- విద్యార్థులకు ఏఐ నాలెడ్జ్ ను తీసుకొస్తామని వెల్లడి
- పాఠశాలలు, కళాశాలలకు ఏఐ సాధనాలు అందుబాటులోకి తీసుకొస్తామన్న కేంద్ర మంత్రి

- మిగతా 2లో

## ఉచిత పథకాలతో డబ్బు వృధా.. సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు..




- ఉచిత పథకాలపై సుప్రీంకోర్టు అసహనం.. ఎలాంటి సంస్కృతిని అభివృద్ధి చేస్తున్నామని మండిపాటు!
- అందరికీ ఉచిత విద్యుత్తును ప్రకటించిన స్టాలిన్ ప్రభుత్వం
- రాష్ట్ర ఆర్థిక స్థితిని పట్టించుకోకుండా ఉచిత విద్యుత్ ఎలా ఇస్తారన్న సుప్రీం
- ఉచితాల వల్ల దేశ అభివృద్ధి దెబ్బతింటుందని వ్యాఖ్య

- మిగతా 2లో

# రూ.10 లక్షల కోట్ల పెట్టుబడి...

## ఏఐ రంగంలో రిలయన్స్ గ్రూప్ సంచలనం



- ఏఐ రంగంలో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడి పెట్టనున్న జియో-రిలయన్స్
- వచ్చే ఏడేళ్లలో ఈ భారీ పెట్టుబడిని పెట్టనున్నట్లు ముకేశ్ అంబానీ వెల్లడి
- గిగావాట్ డేటా సెంటర్లు, గ్రీన్ ఎనర్జీ, ఎడ్జ్ కంప్యూటింగ్‌పై ప్రధాన దృష్టి
- ఏఐ ఉద్యోగాలను సృష్టిస్తుందే తప్ప, తీసేయదని స్పష్టం చేసిన అంబానీ

- మిగతా 2లో

## బొత్స గారూ... మీకు చీజ్‌కు, నెయ్యికి తేడా తెలియదా?



- మండలిలో హెరిటేజ్‌పై వైసీపీ ఆరోపణలను తీవ్రంగా ఖండించిన మంత్రి అచ్చెన్నాయుడు
- చీజ్ ప్యాకెట్లు చూపి నెయ్యి అని ప్రచారం చేస్తున్నారని బొత్సపై విమర్శలు
- హెరిటేజ్‌పై ఒక్క ఆధారమైనా చూపాలని, లేదంటే క్షమాపణ చెప్పాలని డిమాండ్
- అసత్య ఆరోపణలపై హెరిటేజ్ ఇప్పటికే లీగల్ నోటీసులు ఇచ్చిందని వెల్లడి
- ప్రతిష్ఠాత్మక సంస్థలపై దాడి చేయడం వైసీపీ ఫ్యాక్షన్ మనస్తత్వానికి నిదర్శనమని వ్యాఖ్య

- మిగతా 2లో



## పాలు లేకుండా నెయ్యి తీసే టెక్నాలజీ తాడేపల్లి ప్యాలెస్‌లో ఉందేమో!

### జగన్‌పై మంత్రి అనిత సెటైర్

- టీటీడీ నెయ్యి సరఫరాపై జగన్ ఆరోపణలకు మంత్రి అనిత కౌంటర్
- హెరిటేజ్‌కు, ఇందాపూర్ కంపెనీకి ఎలాంటి సంబంధం లేదని స్పష్టీకరణ
- సాక్షి పేపర్, భారతీ సిమెంట్ ధరలు పెరిగిన విషయాన్ని గుర్తుచేసిన అనిత
- వైవీ సుబ్బారెడ్డి హయాంలోనే నెయ్యి కల్తీ జరిగిందని తీవ్ర ఆరోపణలు
- కల్తీని వదిలేసి హెరిటేజ్‌పై బురద జల్లడమేంటని జగన్‌పై ఫైర్

- మిగతా 2లో

### తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు కర్రెగుట్టలో

## ఎదురు కాల్పులు..

### ఇద్దరు మావోయిస్టులు మృతి

- మావోయిస్టు అగ్రనాయకుల కోసం కర్రెగుట్టల్లో భద్రతా దళాల గాలింపు
- సీఆర్పీఎఫ్, ఛత్తీస్‌గఢ్ పోలీసుల సంయుక్త ఆపరేషన్
- భద్రతా బలగాలు, మావోయిస్టులకు మధ్య ఎదురు కాల్పులు

పెన్ పవర్ డెస్క్:సీఆర్పీఎఫ్, ఛత్తీస్‌గఢ్ పోలీసులు తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని కర్రెగుట్టలో కూంబింగ్ ను కొనసాగి స్తున్నాయి. ఈ క్రమంలో ఈరోజు భద్రతా దళాలు జరిపిన కాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి దేవ్‌జీ, జూనియర్ క్యాడర్‌కు

- మిగతా 2లో



## హిందూపురంలో బాలకృష్ణ పర్యటన.. పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

- లేపాక్షి మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన బాలకృష్ణ
- మానేపల్లి నుంచి గౌరిగానిపల్లి వరకు బీటీ రోడ్డు పనులకు భూమిపూజ
- రూ.2.60 కోట్ల వ్యయంతో ఈ రహదారి నిర్మాణం
- పులమతి చెరువులో హంద్రీనీవా జలాలకు జలహారతి ఇచ్చిన ఎమ్మెల్యే



## చూసిందే నమ్మండి

### హెరిటేజ్ పై నారా భువనేశ్వరి ప్రత్యేక వీడియో



పెన్ పవర్ డెస్క్:హెరిటేజ్ ఫుడ్స్ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ నారా భువనేశ్వరి తమ సంస్థ నాణ్యతా

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

## పాలు లేకుండా నెయ్యి తీసే టెక్నాలజీ తాడేపల్లి ప్యాలెస్‌లో ఉందేమో!

తిరుమల తిరుపతి దేవస్థానానికి (టీటీడీ) నెయ్యి సరఫరా అంశంలో వైసీపీ అధినేత జగన్ ఇవాళ మీడియా సమావేశంలో చేసిన ఆరోపణలపై ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అసలు సమస్య అయిన కల్తీని పక్కనపెట్టి, సంబంధం లేని హెరిటేజ్ సంస్థపై జగన్ బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆమె మండిపడ్డారు. గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె, జగన్ వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చారు.

**హెరిటేజ్‌కు, ఇందాపూర్‌కు సంబంధమే లేదు**

జగన్ ఆరోపిస్తున్నట్లుగా హెరిటేజ్‌కు, ఇందాపూర్ కంపెనీకి ఎలాంటి యాజమాన్య సంబంధం లేదని అనిత స్పష్టం చేశారు. ఇందాపూర్ అనేది బల్క్ మార్కెటింగ్ చేసే సంస్థ అని, అది చీజ్, పన్నీర్, టెట్రాప్యాక్ పాలు వంటి ఉత్పత్తులను తయారు చేసి హెరిటేజ్ వంటి కంపెనీలకు విక్రయిస్తుందని వివరించారు. హెరిటేజ్ సంస్థ నేరుగా వినియోగదారులకు మాత్రమే నెయ్యిని విక్రయిస్తుందని, ఎన్నడూ బల్క్‌గా ట్యాంకర్ల ద్వారా ఇతర కంపెనీలకు సరఫరా చేయలేదని తెలిపారు. "హెరిటేజ్ నుంచి ఇందాపూర్‌కు నెయ్యి వెళ్లి, అక్కడి నుంచి టీటీడీకి వస్తుందని చెప్పడానికి కనీసం బుర్ర పనిచేస్తుందా?" అని ఆమె ఎద్దేవా చేశారు. హెరిటేజ్ సంస్థ తన సిద్ధాంతాల ప్రకారం దేవాలయాలకు బల్క్‌గా సరఫరా చేయదని, ఈ విషయం చిన్నపిల్లవాడిని అడిగినా చెబుతాడని అన్నారు.

**ధరల పెరుగుదలపై చిన్న లాజిక్ మిస్సయ్యారు**

2015లో రూ.280 ఉన్న నెయ్యి ధర, 2026 నాటికి రూ.650కి ఎందుకు పెరిగిందని జగన్ ప్రశ్నించడాన్ని అనిత తప్పుబట్టారు. కాలంతో పాటు ధరలు పెరగడం సహజమని, ఈ చిన్న లాజిక్‌ను జగన్ ఎలా విస్మరించారని ఆమె ప్రశ్నించారు. "మీరు సాక్షి పేపర్ ప్రారంభించినప్పుడు దాని ధర రూ.2, ఇప్పుడు రూ.6.50. భారతీ సిమెంట్ బస్తా ధర రూ.250 నుంచి రూ.450కి పెరిగింది. 2015లో రూ.19 ఉన్న పాల ప్యాకెట్ ఇప్పుడు రూ.40కి చేరింది. పాల ధర పెరిగితే నెయ్యి ధర పెరగదా? బహుశా పాలు లేకుండానే నెయ్యి తయారుచేసే టెక్నాలజీ మీ తాడేపల్లి ప్యాలెస్‌లో ఉందేమో" అని ఆమె వ్యంగ్యాస్త్రాలు సంధించారు. కర్ణాటకలో పాల ధరలు అధికంగా ఉండటం వల్లే నందిని డైరీ టీటీడీకి రూ.700కు నెయ్యి సరఫరా చేసిందని, ఆ విషయం గురించి జగన్ ఎందుకు మాట్లాడరని నిలదీశారు.

**అసలు దొంగ మీ బాబాయే**

అసలు సమస్య అయిన నెయ్యి కల్తీ గురించి మాట్లాడకుండా, జగన్ సంబంధం లేని హెరిటేజ్ అంశాన్ని తెరపైకి తెస్తున్నారని అనిత ఆరోపించారు. నెయ్యి కల్తీ జగన్ ప్రభుత్వ హయాంలో, ఆయన బాబాయి వైవీ సుబ్బారెడ్డి టీటీడీ ఛైర్మన్‌గా ఉన్నప్పుడే జరిగిందని అనిత తీవ్ర ఆరోపణలు చేశారు. "నెయ్యిలో రసాయనాలు కలిశాయని సిట్, ఎన్డీబీ రిపోర్టులు స్పష్టంగా తేల్చాయి. కల్తీ జరిగిందని నిర్ధారణ అయ్యాక కూడా అప్పటి మీ ప్రభుత్వం ఆ కంపెనీ టెండర్‌ను ఎందుకు రద్దు చేయలేదు? ఎందుకు ఆ సంస్థను బ్లాక్‌లిస్టులో పెట్టలేదు?" అని ఆమె సూటిగా ప్రశ్నించారు. కల్తీ జరిగిందని చార్జ్‌షీట్‌లో ఉన్నా, మీ బాబాయి స్వయంగా అంగీకరించినా దాని గురించి మాట్లాడకుండా, ముక్కు ఎక్కడ ఉందంటే చుట్టూ తిప్పి చూపినట్లు హెరిటేజ్ గురించి ఎందుకు మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

**టెండర్ నిబంధనలు మార్చిందెవరు?**

కేవలం తమకు నచ్చిన కంపెనీలకు లబ్ధి చేకూర్చేందుకే జగన్ ప్రభుత్వం టెండర్ నిబంధనలను నీరుగార్చిందని అనిత ఆరోపించారు. "ఒక చుక్క పాలు కూడా సేకరించని కంపెనీలు కూడా నెయ్యి సరఫరా చేసేలా నిబంధనలను మార్చారు. రూ.250 కోట్ల టర్నోవర్‌ను రూ.150 కోట్లకు తగ్గించారు. ఇవన్నీ ఎవరికోసం చేశారు? కల్తీపై చర్చకు మేము సిద్ధం. ఆధారాలు చూపించమన్నందుకే ప్రజలకు ఈ వాస్తవాలు వివరిస్తున్నాం. దమ్ముంటే కల్తీ గురించి మాట్లాడండి" అని జగన్‌కు ఆమె సవాల్ విసిరారు.

## రూ.10 లక్షల కోట్ల పెట్టుబడి...

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో రిలయన్స్ ఇండస్ట్రీస్, జియో కలిసి భారీ అడుగు వేయనున్నాయి. రాబోయే ఏడేళ్లలో ఈ రంగంలో రూ.10 లక్షల కోట్ల వరకు పెట్టుబడి పెట్టనున్నట్లు రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ ముకేశ్ అంబానీ గురువారం ప్రకటించారు. 'ఏఐ ఇండియా ఇంపాక్ట్ సమ్మిట్'లో ప్రసంగించిన ఆయన, ఈ పెట్టుబడి కేవలం లాభాల కోసం కాదని, దేశ నిర్మాణం కోసం దశాబ్దాల పాటు ఆర్థిక విలువను సృష్టించే మూలధనమని స్పష్టం చేశారు.ప్రస్తుతం ఏఐ రంగంలో అతిపెద్ద సమస్య కంప్యూటింగ్ వనరుల కొరత, అధిక ఖర్చు అని అంబానీ అన్నారు. ఈ సవాలును అధిగమించేందుకు 'జియో ఇంటెలిజెన్స్' ద్వారా మూడు కీలక కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా జామ్‌నగర్‌లో గిగావాట్-స్థాయి ఏఐ-రెడీ డేటా సెంటర్ల నిర్మాణం ప్రారంభించామని, 2026 ద్వితీయార్థంలో 120 మెగావాట్ల సామర్థ్యం అందుబాటులోకి వస్తుందని చెప్పారు.ండోది, తమకున్న గ్రీన్ ఎనర్జీ సామర్థ్యమని, ఆంధ్రప్రదేశ్, కచ్‌లలోని సౌర విద్యుత్ ప్లాంట్ల నుంచి 10 గిగావాట్ల గ్రీన్ పవర్ సిద్ధంగా ఉందని వివరించారు. మూడోది, దేశవ్యాప్తంగా ఎడ్జ్ కంప్యూటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయడం. దీని ద్వారా సామాన్యులకు సైతం తక్కువ ఖర్చుతో, వేగవంతమైన ఏఐ సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.

అన్ని భారతీయ భాషల్లో ప్రపంచస్థాయి ఏఐ సామర్థ్యాన్ని సాధించడం తమ లక్ష్యమని, ఇది సమ్మిళిత వృద్ధికి దోహదపడుతుందని అన్నారు. ఏఐ ఉద్యోగాలను తీసివేయదని, కొత్తగా నైపుణ్యం గల ఉద్యోగాలను సృష్టిస్తుందని అంబానీ భరోసా ఇచ్చారు. దేశంలోని స్టార్టప్‌లు, ఐఐటీలు, పరిశోధన సంస్థలతో పాటు ప్రపంచంలోని అగ్రశ్రేణి టెక్ కంపెనీలతో కలిసి పనిచేస్తామని, ఏఐ శతాబ్దానికి భారత్‌ను సహ-నిర్మాతగా నిలుపుతామని ఆయన వెల్లడించారు.

## చూసిందే నమ్మండి

- మొదటి పేజీ తరువాయి

ప్రమాణా లపై వినియోగదారులకు భరోసా ఇస్తూ 'హెరిటేజ్ ప్రామిస్' పేరుతో ఒక వీడియోను విడుదల చేశారు. 'చూసిందే నమ్మండి' అనే నినాదంతో విడుదలైన ఈ వీడియోలో కంపెనీ పనితీరు, రైతుల పట్ల అనుసరిస్తున్న విధానాలను ఆమె వివరించారు.గత 33 ఏళ్లుగా ప్రతి ఇంటికి తాజా, ఆరోగ్యకరమైన పాల ఉత్పత్తులు అందించడమే లక్ష్యంగా హెరిటేజ్ పనిచేస్తోందని భువనేశ్వరి తెలిపారు. రూ.4 కోట్ల పెట్టుబడితో ప్రారంభమైన సంస్థ, నేడు రూ.4,000 కోట్ల స్థాయికి ఎదిగినా నాణ్యత విషయంలో ఎన్నడూ రాజీ పడలేదని ఆమె స్పష్టం చేశారు. వినియోగదారుల ఇంటికి చేరే ప్రతి ఉత్పత్తి 25 కఠినమైన నాణ్యతా పరీక్షలు దాటిన తర్వాతే వస్తుందని, 500 మందికి పైగా నిపుణులు ఈ ప్రమాణాలను నిరంతరం పర్యవేక్షిస్తారని ఆమె పేర్కొన్నారు.

తొమ్మిది రాష్ట్రాల్లోని సుమారు 3 లక్షల మంది పాడి రైతులతో తమ సంస్థ కలిసి పనిచేస్తోందని భువనేశ్వరి వివరించారు. పారదర్శకత, న్యాయమైన ధర, సకాలంలో చెల్లింపులు అనే సూత్రాలతో రైతులకు సాధికారత కల్పిస్తున్నామని అన్నారు. ఈ వీడియోను పూర్తిగా చూసి, వాస్తవాలను స్వయంగా తెలుసుకోవాలని ఆమె ప్రజలను కోరారు.

# ఇది బాబు భజన..అన్నీ తప్పుడు లెక్కలే

- మొదటి పేజీ తరువాయి

పారదర్శకత లేకపోవడానికి నిదర్శనమన్నారు. మహిళలకు రూ.1,500, నిరుద్యోగ భృతి వంటి హామీలకు నిధుల కేటాయింపు ఏదని ప్రశ్నించారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ ను లక్ష్యంగా చేసుకుని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రజల డబ్బుతో కొలంబో, ఢిల్లీ అంటూ విమానాల్లో తిరుగుతూ క్రికెట్ మ్యాచ్ లు చూస్తూ, స్టేడియాల్లో జల్సాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. "రాత్రికి కొలంబోలో ఉంటాడు, మరుసటి రోజు ఉదయం విజయవాడలో ఉంటాడు... సాయంత్రానికి ఢిల్లీ వెళతాడు... అంతా ప్రైవేటు విమానాలే. దేశంలో బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్నవారు ఇలా జల్సాలు చేయడం ఎక్కడైనా ఉందా? చంద్రబాబుకు ఒక విమానం, లోకేశ్ కు ఒక విమానం, పవన్ కల్యాణ్ కు ఓ విమానం... అందరూ గాల్లోనే ఉంటారు. క్రికెట్ మ్యాచ్ చూడాలంటే కొలంబోనే వెళ్లాలా... టీవీలో చూస్తే కనపడదా... నేను కూడా టీవీలోనే చూశాను" అంటూ జగన్ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు.

## విశాఖలో వేడుకగా 'ఇంటర్నేషనల్ సిటీ పరేడ్'

'సిటీ ఆఫ్ డెస్టినీ' విశాఖపట్నం సాగర తీరం గురువారం సాయంత్రం అద్భుత ప్రదర్శనలకు వేదికైంది. ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ (×ఫ్=), మిలన్ 2026 వేడుకల్లో భాగంగా ఆర్కే బీచ్‌లో నిర్వహించిన అంతర్జాతీయ నగర పరేడ్ కన్నుల పండువగా సాగింది. భారత నావికాదళ శక్తి సామర్థ్యాలు, వివిధ దేశాల సాంస్కృతిక వైభవానికి ఈ పరేడ్ దర్పణం పట్టింది.

ఈ భారీ పరేడ్‌లో భాగంగా తొలుత భారత నావికాదళ విమానాలు, హెలికాప్టర్లు గగనతలంలో అబ్బురపరిచే విన్యాసాలు చేశాయి. అనంతరం భారత త్రివిధ దళాలు (ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్), కోస్ట్ గార్డ్ కంటింజెంట్లు కవాతు నిర్వహించాయి. వీరితో పాటు ఫ్రాన్స్, రష్యా, వియత్నాం, థాయ్‌లాండ్, శ్రీలంక సహా పలు మిత్ర దేశాల నావికాదళ సిబ్బంది, వారి సెరిమోనియల్ బ్యాండ్‌లు ప్రదర్శనలో పాల్గొని ఆకట్టుకున్నాయి.ఈ వేడుకకు ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా హాజరై గౌరవ వందనం స్వీకరించారు. నేవీ కమాండోలు ప్రదర్శించిన సాహస కృత్యాలు, డ్రోన్, లేజర్ షోలు,

చివరిలో బాణసంచా వెలుగులు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. వివిధ దేశాల కళాకారులు వారి సంప్రదాయ నృత్యాలతో అలరించారు.భారత నౌకాదళ శక్తిని ప్రపంచానికి చాటడంతో పాటు, మిత్ర దేశాలతో సముద్ర భద్రతలో సహకారాన్ని, సాంస్కృతిక సంబంధాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ పరేడ్‌ను నిర్వహించారు. ఈ అంతర్జాతీయ వేడుకకు భారీ సంఖ్యలో ప్రజలు తరలిరావడంతో ఆర్కే బీచ్ పరిసరాలు జనసంద్రంగా మారాయి. నిర్వాహకులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

## నకిలీ వెబ్‌సైట్ల మాయాజాలం...

సాంకేతికత పెరిగాక ఏ చిన్న సమాచారం కావాలన్నా వెంటనే గూగుల్ వంటి సెర్చ్ ఇంజిన్లను ఆశ్రయించడం సాధారణమైంది. అయితే, మనకున్న ఈ అలవాటే ఇప్పుడు సైబర్ నేరగాళ్లకు ఆయుధంగా మారింది. సెర్చ్ ఫలితాల్లో అగ్రస్థానంలో కనిపించినంత మాత్రాన అది అసలైన, సురక్షితమైన వెబ్‌సైట్ అని గుడ్డిగా నమ్మితే నిలువునా మోసపోయే ప్రమాదం ఉందని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ హెచ్చరించారు. ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజలు అత్యంత జాగరూకతతో వ్యవహరించాలని ఆయన సూచించారు.

**మోసగాళ్ల కొత్త ఎత్తుగడ ఇదే**

సైబర్ మోసగాళ్లు ఇప్పుడు 'సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్' (ఎస్ఈవో) అనే అధునాతన టెక్నిక్‌ను, పెయిడ్ ప్రకటనలను వాడుకుంటున్నారు. బ్యాంకులు, ప్రభుత్వ పోర్టల్స్, ప్రముఖ ఈ-కామర్స్ సంస్థల పేర్లతో అచ్చుగుద్దినట్టు ఉండే నకిలీ 'ఫిషింగ్' వెబ్‌సైట్లను సృష్టిస్తున్నారు. వినియోగదారులు కస్టమర్ కేర్ నంబర్లు, ప్రభుత్వ పథకాలు లేదా ఇతర సేవల కోసం వెతికినప్పుడు, ఈ నకిలీ సైట్లు సెర్చ్ ఫలితాల్లో టాప్‌లో కనిపించేలా చేస్తున్నారు. వీటిపై 'హజూశీఅంశీతీవస' లేదా 'ూాఽ' అని చిన్న అక్షరాలతో ఉంటుంది. వాటిని గమనించకుండా నిజమైన వెబ్‌సైట్ అని భ్రమపడి క్లిక్ చేయగానే మోసం మొదలవుతుంది.వెబ్‌సైట్ ఓపెన్ అయిన వెంటనే వ్యక్తిగత వివరాలు, లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్‌లు, క్రెడిట్/డెబిట్ కార్డు నంబర్లు, సీవీవీ, ఓటీపీ వంటి అత్యంత సున్నితమైన సమాచారాన్ని నమోదు చేయమని కోరతారు. ఆ వివరాలు వారికి చిక్కగానే క్షణాల్లో మీ బ్యాంకు ఖాతాను ఖాళీ చేస్తారు. కేవలం ఆర్థికంగా నష్టపరచడమే కాకుండా, మీ గుర్తింపు పత్రాలను దొంగిలించి 'ఐడెంటిటీ థెఫ్ట్'కు పాల్పడే ప్రమాదం కూడా ఉంది. అంటే మీ పేరు మీద రుణాలు తీసుకోవడం లేదా ఇతర నేరాలకు పాల్పడటం వంటివి చేయవచ్చు.

**రక్షణ కవచం అప్రమత్తతే**

ఈ తరహా మోసాల బారిన పడకుండా ఉండేందుకు పోలీసులు కొన్ని కీలక సూచనలు జారీ చేశారు.

ఏదైనా వెబ్‌సైట్‌ను సందర్శించే ముందు దాని చిరునామా (ఖ=ూ)ను క్షుణ్ణంగా పరిశీలించాలి. అసలు వెబ్‌సైట్ స్పెల్లింగ్‌కు, నకిలీ వెబ్‌సైట్ స్పెల్లింగ్‌కు చిన్న తేడాలుంటాయి.

వీలైనంత వరకు సెర్చ్ ఇంజిన్లలో వెతకడం కన్నా, మీకు తెలిసిన అధికారిక వెబ్‌సైట్ చిరునామాను నేరుగా బ్రౌజర్ అడ్రస్ బార్‌లో టైప్ చేసి ఓపెన్ చేయడమే సురక్షితం.

సెర్చ్ ఫలితాల్లో Sponsored లేదా Ad అని కనిపించే లింకులపై క్లిక్ చేసేటప్పుడు రెట్టింపు జాగ్రత్త అవసరం.

ఒకవేళ మీరు సైబర్ మోసానికి గురైనట్లు అనుమానం వస్తే, ఏమాత్రం ఆలస్యం చేయకుండా జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కి కాల్ చేయాలి లేదా cybercrime.gov.in పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలి. ఆన్‌లైన్ ప్రపంచంలో మన అప్రమత్తతే మనకు రక్షణ కవచమని పోలీసులు స్పష్టం చేస్తున్నారు.

## కాలేజీలు, స్కూళ్లకు ఏఐని అందుబాటులోకి తీసుకొస్తాం

ఢిల్లీలో జరుగుతున్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026లో కేంద్ర ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్ భారత్ భవిష్యత్ ఏఐ ప్లాన్‌ను స్పష్టంగా వివరించారు. దేశాన్ని ప్రపంచ ఏఐ పటంలో నాయకుడిగా నిలబెట్టడమే లక్ష్యంగా పాఠశాల, కాలేజీ స్థాయి సిలబస్‌ను పూర్తిగా మారుస్తున్నామని ప్రకటించారు.విద్యార్థులకు ఏఐ నాలెడ్జ్ ను పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర మంత్రి అన్నారు. పాఠశాలలు, కళాశాలలకు ఏఐ సాధనాలు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. విద్యార్థులు కేవలం సాంకేతికతను నేర్చుకోవడమే కాకుండా, సమస్యలకు కొత్త పరిష్కారాలను అభివృద్ధి చేసేలా ప్రోత్సహిస్తామని చెప్పారు. "దేశంలో ప్రతిభకు కొరత లేదు. యువత భవిష్యత్తు అవసరాలకు తగ్గట్టుగా నైపుణ్యాలు మెరుగుపరుచుకుంటే... భారత్ ప్రపంచ ఏఐ పటంలో అగ్రస్థానంలో నిలుస్తుంది" అని అన్నారు. సెమీకండక్టర్, టెలికాం రంగాల్లో సాధించిన విజయాల తరహాలోనే ఏఐ మిషన్‌ను వేగవంతం చేస్తామని మంత్రి అన్నారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్రియేటివ్ టెక్నాలజీ వంటి సంస్థలు పరిశ్రమ అవసరాలకు తగ్గట్టుగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నాయని ప్రశంసించారు.

## నేడు ఢిల్లీకి సీఎం చంద్రబాబు.. ఏఐ ఇంపాక్ట్ సదస్సులో కీలక ఒప్పందాలు!

ఆంధ్రప్రదేశ్‌ను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో అగ్రగామిగా నిలబెట్టడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీలో కీలక పర్యటన చేపట్టనున్నారు. రేపు (ఫిబ్రవరి 20) ఢిల్లీలోని భారత్ మండపంలో జరగనున్న 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026'లో ఆయన పాల్గొంటారు. ఈ పర్యటనలో భాగంగా రాష్ట్రంలో ఏఐ ఆధారిత అభివృద్ధికి, యువతకు నైపుణ్య శిక్షణకు మార్గం సుగమం చేసేలా పలు అంతర్జాతీయ దిగ్గజ సంస్థలతో కీలక ఒప్పందాలు (ఎంఓయూలు) చేసుకోనున్నారు.ఈ సదస్సులో భాగంగా ఏపీ ప్రభుత్వం పలు చరిత్రాత్మక ఒప్పందాలకు శ్రీకారం చుట్టనుంది. రాష్ట్రంలోని 10 లక్షల మంది యువతకు ఏఐ, క్వాంటం టెక్నాలజీ, సైబర్ సెక్యూరిటీ వంటి భవిష్యత్ సాంకేతికతల్లో నైపుణ్యాలు కల్పించేందుకు దిగ్గజ ఐటీ సంస్థ ఐబీఎంతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకోనుంది. అలాగే, ఏఐ, క్వాంటం టెక్నాలజీలలో పరిశోధన, అభివృద్ధిని ప్రోత్సహించేందుకు యూనిసీసీ సంస్థతో కలిసి 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రంలో క్వాంటం ఏఐ యూనివర్సిటీ ఏర్పాటు కోసం ఎన్ఐఈఎల్ఐటీ సంస్థతో, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ట్యూటర్ కోసం ఐఐటీ మద్రాస్‌తోనూ ప్రభుత్వం ఎంఓయూలు చేసుకోనుంది. ప్రముఖ టెక్ సంస్థ ఎన్విడియా భాగస్వామ్యంతో రాష్ట్రంలో ఏఐ లివింగ్ ల్యాబ్స్ ఏర్పాటుపై కూడా ఈ సదస్సులో కీలక ప్రకటన చేయనున్నారు.రేపు ఉదయం 9:30 గంటలకు జరిగే ప్లీనరీ సెషన్‌లో అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ, కేంద్ర మంత్రి జితిన్ ప్రసాద, టీసీఎస్ ప్రతినిధులతో

కలిసి చంద్రబాబు ప్రసంగిస్తారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు ప్రపంచ ఆర్థిక వేదిక (వరల్డ్ ఎకనామిక్ ఫోరం) నిర్వహించే రౌండ్‌టేబుల్ సమావేశంలో కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్, డబ్ల్యూఈఎఫ్ సీఈఓ బోర్గే బ్రెండేతో కలిసి కృత్రిమ మేధస్సు అంశంపై చర్చిస్తారు. ఈ పర్యటనలో భాగంగా యునైటెడ్ కింగ్‌డమ్ ప్రతినిధి బృందంతో పాటు అరామ్కో, అడోబ్, ఆటోడెస్క్ వంటి కంపెనీల అధిపతులతోనూ ముఖ్యమంత్రి విడివిడిగా సమావేశమై రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడంపై చర్చలు జరుపుతారు.

**ఈ సాయంత్రం జైపూర్ కు!**

కాగా, ఢిల్లీ పర్యటనకు ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు సాయంత్రం జైపూర్ వెళ్లనున్నారు. కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ప్రాజెక్టు డైరెక్టర్, ఐఏఎస్ అధికారి వికాస్ మర్మత్ వివాహ వేడుకకు హాజరై, రాత్రికి అక్కడే బస చేస్తారు. రేపు ఉదయం జైపూర్ నుంచి నేరుగా ఢిల్లీకి చేరుకొని ఏఐ సదస్సులో పాల్గొంటారు.

## తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు కర్రెగుట్టలో ఎదురు కాల్పులు.. ఇద్దరు మావోయిస్టులు మృతి

- మొదటి పేజీ తరువాయి

చెందిన బెటాలియన్ ఇన్‌ఛార్జ్ కేసా సోఢీ ఈ ప్రాంతంలో ఉన్నట్లు పక్కా సమాచారం అందడంతో పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టారు. సుమారు రెండు వేల మంది జవాన్లు కర్రెగుట్ట అటవీ ప్రాంతంలో రెండు రోజులుగా జల్లెడ పడుతుండగా బలగాలకు మావోయిస్టులు తారసపడ్డాయి. ఈ క్రమంలో మావోయిస్టులు కాల్పులు జరపగా, పోలీసులు ఎదురు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు.2026 మార్చి 31 నాటికి దేశంలో నక్సలిజాన్ని నిర్మూలిస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రకటించిన విషయం తెలిసిందే. సీఆర్పీఎఫ్, కోబ్రా, డీఆర్జీ, సీఏఎఫ్ సంయుక్త బలగాలు గత ఏడాది ఏప్రిల్ నెలలో 21 రోజుల పాటు కర్రెగుట్టలో నిర్వహించిన భారీ ఆపరేషన్‌లో 31 మంది మావోయిస్టులు మృతి చెందారు. అయితే అప్పుడు మావోయిస్టు పార్టీ సీనియర్ క్యాడర్ తప్పించుకుంది. వారి కోసం భద్రతా బలగాలు జల్లెడపడుతున్నాయి.

## హిందూపురంలో బాలకృష్ణ పర్యటన.. పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తన నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. గురువారం లేపాక్షి మండలంలో పర్యటించిన ఆయన, రెండు కీలకమైన బీటీ రహదారుల నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఈ అభివృద్ధి పనుల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.వివరాల్లోకి వెళ్తే, మండలంలోని మానేపల్లి నుంచి గౌరిగానిపల్లి వరకు రూ.2.60 కోట్ల వ్యయంతో చేపట్టనున్న బీటీ రహదారి నిర్మాణ పనులను బాలకృష్ణ లాంఛనంగా ప్రారంభించారు. ఈ రహదారి పూర్తయితే స్థానిక గ్రామస్తులకు రవాణా కష్టాలు తీరుతాయని తెలిపారు. అనంతరం ఆయన పులమతి చెరువు వద్దకు చేరుకుని, హంద్రీనీవా జలాలకు ప్రత్యేక పూజలు చేసి జలహారతి ఇచ్చారు.ఇదే పర్యటనలో భాగంగా కొత్తపల్లి నుంచి నాగేపల్లి వరకు నిర్మించనున్న మరో రహదారి పనులకు కూడా బాలకృష్ణ భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జిల్లాలో రవాణా, సాగునీటి రంగాలను బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామని ఈ సందర్భంగా బాలకృష్ణ స్పష్టం చేశారు.

## ఉచిత పథకాలతో డబ్బు వృధా.. సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు..

రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటిస్తున్న ఉచిత పథకాలు దేశ ఆర్థిక వృద్ధికి ఆటంకమవుతాయని సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, విపుల్ పంచోలితో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఉచిత ఆహారం, సైకిళ్లు, విద్యుత్తు ఇవ్వడం కన్నా ఉద్యోగాలు, ఉపాధి అవకాశాల సృష్టిపై దృష్టి సారించాలని సూచించింది. తమిళనాడులోని డీఎంకే ప్రభుత్వ ఉచిత విద్యుత్తు ప్రకటనపై సర్వోన్నత న్యాయస్థానం సీరియస్‌గా స్పందించింది. వినియోగదారుల ఆర్థిక స్థితితో సంబంధం లేకుండా రాష్ట్రంలోని అందరికీ ఉచిత విద్యుత్ అందించేలా తమిళనాడు పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ ప్రతిపాదించింది. ఈ నేపథ్యంలో డీఎంకే ప్రభుత్వంపై దాఖలైన పిటిషన్ ను విచారిస్తూ ఈ వ్యాఖ్యలు చేసింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని పట్టించుకోకుండా ఉచిత విద్యుత్తును ఎలా అందిస్తారని ప్రశ్నించింది.చాలా రాష్ట్రాల్లో రెవెన్యూ లోటు పెరుగుతోందని... అయినప్పటికే ఉచిత పథకాల పంపిణీ జరుగుతోందని ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. ఇలాంటి ఉచిత పథకాల వల్ల దేశ అభివృద్ధికి విఘాతం కలుగుతుందని వ్యాఖ్యానించింది. సంక్షేమ పథకాల్లో భాగంగా కరెంట్ బిల్లులు చెల్లించలేని వారికి ఉచిత విద్యుత్ అందిస్తామంటే ఒక అర్థం ఉంటుందని... కానీ, మీరు ఆర్థిక స్థాయితో సంబంధం లేకుండా అందరికీ ఉచిత విద్యుత్ ఇస్తామని చెబుతున్నారని అసహనం వ్యక్తం చేసింది. ఆహారం, విద్యుత్ ఇలా అన్నీ ఫ్రీగా ఇస్తూ... మనం ఎలాంటి సంస్కృతిని అభివృద్ధి చేస్తున్నామని ప్రశ్నించింది. ఎన్నికలకు ముందే రాష్ట్రాలు ఇలాంటి ఉచిత పథకాలను ఎందుకు తీసుకొస్తున్నాయని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఎన్నికల సమయంలో అన్నీ ఉచితంగా ఇచ్చుకుంటూ పోతే... అభివృద్ధి కార్యక్రమాలకు ఒక్క పైసా కూడా మిగలదని వ్యాఖ్యానించింది. ఈ పిటిషన్ పై కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది.

## బొత్స గారూ... మీకు చీజ్‌కు, నెయ్యికి తేడా తెలియదా?

హెరిటేజ్ సంస్థపై వైసీపీ నేతలు చేస్తున్న ఆరోపణలను రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు తీవ్రంగా ఖండించారు. చీజ్ ప్యాకెట్లు చేతిలో పట్టుకుని, వాటిని నెయ్యి అని చూపిస్తూ ప్రజలను, సభను తప్పుదోవ పట్టిస్తున్నారని, వైసీపీ నేతలకు కనీస అవగాహన ఉందా అని శాసనమండలిలో నిలదీశారు. మండలిలో వైసీపీ సభ్యుల తీరు అత్యంత బాధ్యతారాహిత్యంగా ఉందని ఆయన విమర్శించారు.ఇందాపూర్ డెయిరీకి, హెరిటేజ్ సంస్థకు ఎలాంటి సంబంధం లేదని గత రెండు రోజులుగా తాను స్పష్టంగా సమాధానం ఇస్తున్నప్పటికీ, అదే అంశాన్ని పట్టుకుని సభా సమయాన్ని వృథా చేయడం దుర్మార్గమని అచ్చెన్నాయుడు అన్నారు. ముఖ్యంగా మండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణను ఉద్దేశించి, "చీజ్ ప్యాకెట్లను చూపిస్తూ నెయ్యి ప్యాకెట్లు అంటూ ప్రజలను మోసం చేస్తున్నారు. మీకు చీజ్‌కు, నెయ్యికి మధ్య తేడా కూడా తెలియదా?" అని ఎద్దేవా చేశారు. హెరిటేజ్‌పై అంతగా అనుమానాలు ఉంటే ఒక్కటంటే ఒక్క చిన్న ఆధారాన్నైనా సభ ముందు పెట్టాలని, లేనిపక్షంలో బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

ఈ అసత్య ప్రచారాలపై హెరిటేజ్ సంస్థ ఇప్పటికే వైసీపీ నేతలకు లీగల్ నోటీసులు పంపిందని, వాటికి సమాధానం చెప్పాల్సిన బాధ్యత వారిపై ఉందని అచ్చెన్నాయుడు గుర్తుచేశారు. "గతంలో రాయలసీమలో ఫ్యాక్షన్ రాజకీయాలతో పచ్చని తోటలు నరికించినట్లు, ఇప్పుడు ప్రతిష్ఠాత్మక సంస్థల ఆర్థిక మూలాలపై దాడి చేయాలని చూడటం మీ ఫ్యాక్షన్ మనస్తత్వానికి నిదర్శనం" అని ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు.ప్రభుత్వాలను అడ్డం పెట్టుకుని భారతి సిమెంట్ పేరుతో ప్రభుత్వ ధనాన్ని దోచుకున్న చరిత్ర వైసీపీదని, కానీ హెరిటేజ్ సంస్థ ప్రభుత్వాలతో సంబంధం లేకుండా పారదర్శకంగా వ్యాపారం చేయాలనే చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్న సంస్థ అని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. నిత్యం వాయిదా తీర్మానాలతో సభను పక్కదారి పట్టించడం మానేసి, దమ్ముంటే ఆధారాలతో మాట్లాడాలని, నిర్మాణాత్మక చర్చకు రావాలని వైసీపీకి ఆయన సవాల్ విసిరారు.

# డ్రైన్‌లను శుభ్రపరిచారు

**ఏలూరు ఫిబ్రవరి 19 పెన్‌పవర్ :** ఏలూరు రూరల్ మండలం కొక్కిరాయిలంక గ్రామంలో ఇళ్లముందు మురుగుతో ఇక్కట్లు పేరుతో పెన్‌పవర్ దినపత్రిక లో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు.సచివాలయం కార్యదర్శి పారిశుధ్య సిబ్బందితో గ్రామంలో డ్రైన్‌లను శుభ్రపరిచి రసాయనాలు వెదజల్లించారు



పెన్ పవర్

పోలవరం - ఏలూరు
తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి

# నిబంధనలు పాటించని ఇసుక రవాణా దారులు





**పట్టించుకోని రెవెన్యూ సిబ్బంది**

**వై రామవరం, పెన్ పవర్,ఫిబ్రవరి 19 :** మండల సరిహద్దులో ఉన్న పెద్దేరు నుండి నిత్యం నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తోడేస్తూ రవాణా చేస్తున్న రెవెన్యూ సిబ్బంది పట్టించుకున్న దాఖలాలు లేవని పలువురు ఆరోపిస్తున్నారు.

గతంలో రెండు మండలాల సరిహద్దులో ఉన్న పెద్దేరు వంతెన సమీపంలో ఇసుకను తీయడం వల్ల వంతెనకు ప్రమాదం పొంచి ఉందని పలుమార్లు పెన్ పవర్ దినపత్రిక లో కథనాలు ప్రచురించిన సంబంధిత సిబ్బందిలో చలనం మాత్రం రాలేదని పలువురు ఆరోపిస్తున్నారు. పెద్దేరు వంతెనకు రెండు వైపులా 500 మీటర్ల దూరంలో ఇసుకను తీయరాదని రెవెన్యూ, ఆర్ అండ్ బి, పోలీసుల ఆధ్వర్యంలో ఆంక్షలు విధించిన ఇసుక అక్రమ రవాణా దారులు యదేచ్ఛగా ఇసుకను సేకరిస్తూనే ఉన్నారని తెలిపారు. ఉచిత ఇసుక అని రెవెన్యూ అధికారులు అంటున్నారని, హౌసింగ్ కాలనీ లబ్ధిదారులకు మాత్రం ఇసుక ప్రియం గానే ఉంటుందని లబ్ధిదారులు వాపోతున్నారు. హౌసింగ్ కాలనీలకు తప్ప ఏ విధమైన ప్రభుత్వ భవనాల నిర్మాణానికి అయినా గోదావరి ఇసుకను వాడ రాదని నిబంధనఉన్న కాంట్రాక్టర్లు సెలయేటిలో ఇసుకనే రాత్రి సమయంలో ప్రోక్లైనర్లతో అక్రమంగా తోడేస్తూ రవాణా చేస్తున్నారని స్థానికులు అంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను అక్రమంగా తోడిస్తున్న సంబంధిత సిబ్బంది పట్టించుకోవడంలేదని పలురు ఆరోపిస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి పెద్దేరు వంతెన ఇరువైపులా 500 మీటర్ల వరకు ఇసుకను తీయకుండా చర్యలు తీసుకుని, పెద్దేరు వంతెనకు ప్రమాదవ సంభవించకుండా చూడవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని స్థానికులు కోరుతున్నారు.

## ఫీజు బాకాయిలు చెల్లిస్తేనే

# పరీక్షలు రాయనిస్తామని ప్రైవేటు విద్యాసంస్థల బెదిరింపులు



- అసలే పరీక్షల టెన్షన్,ఆపై యాజమాన్యాల ఒత్తిడితో విద్యార్థులు ఆందోళన
- విద్యాసంస్థల్లో రకరకాల పేర్లతో ఫీజుల దోపిడి
- అమలు కాని 50 శాతం రాయితీ, ప్రభుత్వ ఫీజుల విధానం
- పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగం
- విద్యార్థి, ప్రజా సంఘాలు విమర్శలు

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 20**

రాష్ట్ర వ్యాప్తంగా విద్యా సంవత్సరం ముగింపు దశకు చేరింది. రెండు, మూడు రోజుల్లో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే ప్రాక్టికల్ పరీక్షలు పూర్తయ్యాయి. మార్చి నెలలో పదవ తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పరీక్షలు ఎలా ఎదుర్కోవాలో ! పేపర్లు ఎలా ఉంటాయో ! చదివిన ప్రశ్నలు, సబ్జెక్టులు వస్తాయా లేదా అని రకరకాల ఆందోళనతో లక్షల మంది విద్యార్థిని, విద్యార్థుల్లో ( పరీక్షల జ్వరం ) తీవ్ర ఒత్తిడి నెలకొంటుంది. ప్రభుత్వ విద్యా సంస్థల్లో పరిస్థితులు ఎలా ఉన్నా, ప్రైవేట్ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థిని, విద్యార్థులపై ఆయా యాజమాన్యాల, అధ్యాపకులు ర్యాంకుల కోసం, మార్కుల కోసం చేసే ఒత్తిడి ని చిన్నారులు తట్టుకోవడం సామాన్యమైన విషయం కాదు. ఇటువంటి టెన్షన్ పరిస్థితుల్లో ఫీజు బకాయిల కోసం చిన్నారులను తరగతి గదుల్లో మిగతా విద్యార్థుల ముందు నిలబెట్టడం, కించపరిచే విధంగా మాట్లాడడం, తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితుల పై అవహేళన మాట్లాడటం, తరగతుల నుంచి బహిష్కరించడం వంటి చర్యలతో విద్యార్థులను, తల్లిదండ్రులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఒకటి నుంచి 10వ తరగతి, ప్రైవేటు, కార్పొరేటు అకాడమిక్, ఇంజనీరింగ్, బీఈడీ, ఫార్మసీ, వృత్తి విద్యా సంస్థల విద్యా బోధన ఎలా ఉన్నప్పటికీ, ఫీజుల దోపిడీల్లో మాత్రం ఒకే సారూప్యత కనబరుస్తున్నారని ఆరోపణలు వెల్లు వెత్తుతున్నాయి. నగర పరిసర ప్రాంతాల్లో సుమారు 50 వరకు ప్రైవేటు, కార్పొ"రేటు" విద్యాసంస్థలు ఉన్నాయి. వీటిలో లక్షలాదిమంది విద్యార్థిని, విద్యార్థులు రకరకాల పేర్లతో లక్షల రూపాయలు ఫీజులు చెల్లిస్తున్నారు.

పరీక్షల సమయం దగ్గర కావడంతో ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు ఫీజు బకాయిలు చెల్లించాలని లేదంటే పరీక్షలు రాయనిచ్చేది లేదని బెదిరింపులకు దిగడం, హాల్ టికెట్లు ఇచ్చేది లేదని విద్యార్థిని, విద్యార్థులను, వారి తల్లిదండ్రులపై తీవ్ర వత్తుడులకు గురి చేయడం ఆందోళన కలిగిస్తోంది. విద్యా సంవత్సరం చివర వరకు ఆగి, పరీక్షలకు ముందు, హాల్ టికెట్లు ఇచ్చేముందు బకాయిలకు ముడిపెట్టి విద్యార్థులను, తల్లిదండ్రులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అర్హులైన పేద, మధ్యతరగతి వర్గాలకు, కొన్ని సామాజిక వర్గాలకు, జర్నలిస్టుల పిల్లలకు ఫీజుల్లో 50 శాతం రాయితీలు కల్పించాలని ప్రభుత్వం ఆదేశాలను, ఫీజు రియంబర్స్మెంట్ పథకం చెల్లింపులు, ప్రవేట్ విద్యాసంస్థలు తుంగ లోకి తొక్కుతున్నాయి. ప్రైవేటు విద్యాసంస్థల్లో కోర్సులు వారిగా వసూలు చేయాల్సిన ఫీజుల విధానం స్పష్టంగా ప్రభుత్వం నిర్దేశించినప్పటికీ ఎక్కడ అమలు చేయని పరిస్థితులు నెలకొన్నాయి. పరీక్షల ముందు విద్యార్థిని ,విద్యార్థుల్లో ఉండే ఆందోళనకు తోడు, ఫీజు బకాయిలు చెల్లించాలని యాజమాన్యాలు చేసే ఒత్తిడి విద్యార్థిని, విద్యార్థుల ఏకాగ్రతను దెబ్బతీస్తాయని తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. విద్యార్థులను చేర్చుకునే ముందు ప్రైవేటు విద్యాసంస్థలు రకరకాల రాయితీ హామీలు ఇస్తున్నాయి. వాటిలో ప్రతిభ కలిగిన విద్యార్థులకు ఉచితంగా చదువు చెప్పిస్తామని, సొంతంగా పరీక్షలు నిర్వహించడం, తక్కువ మార్కులు వచ్చాయి అయినా సరే కళాశాలలో చేర్పించుకుంటామని, ఫీజులు తగ్గిస్తామని, ప్రభుత్వం అందించే రాయితీలు అమలు చేస్తామని చెప్పి జాయిన్ చేసుకుంటున్నాయి. తీరా జాయిన్ అయిన అనంతరం బుక్స్ కు, డ్రస్సులు , బస్సు సౌకర్యాలు, ఐఐటీ, ఇంజనీరింగ్ ,మెడికల్ ప్రత్యేక శిక్షణ, ప్రత్యేక తరగతులు అంటూ తల్లిదండ్రులను ఫీజులు పేరిట దోపిడీ చేస్తున్నారని ప్రజా సంఘాల, విద్యార్థి సంఘాల నుంచి విమర్శలు వస్తున్నా, ప్రభుత్వానికి ఫిర్యాదులు వెళ్తున్న ప్రైవేటు విద్యాసంస్థలు లెక్క చేయకుండా మొండివైఖరి అలంబిస్తున్నాయి. ఈ వైఖరికి ప్రధానంగా సంబంధిత రాజకీయ పార్టీలకు అధికార, ప్రతిపక్ష పార్టీలకు, కోట్ల రూపాయల విరాళాలు తెర వెనుక భారీ ఎత్తున అందించడమేనని విమర్శలు వస్తున్నాయి. ఈ క్రమంలో వాటిపై ఎన్ని ఫిర్యాదులు వచ్చినా ప్రభుత్వం, విద్యాశాఖ ఉన్నత అధికారులు పట్టించుకోవడంలేదని తల్లిదండ్రులు, ప్రజా సంఘాలు విమర్శిస్తున్నాయి. ఫీజుల నిర్మాణం, చెల్లింపు విధానం ముందే చెబితే తమ ఆర్థిక శక్తి సామర్థ్యాల మేర నడుచుకుంటామని, లేదంటే ఇతర ప్రత్యామ్నాయాలు చూసుకుంటామని తల్లిదండ్రులు వాపోతున్నారు. పిల్లల భవిష్యత్తు కోసం అప్పులు చేసి జాయిన్ చేసిన తర్వాత, సంవత్సరం అంతా వదిలేసి, హాల్ టికెట్లు ఇచ్చే ముందు, పరీక్షల ముందు ఫీజు బకాయలపై వత్తుళ్ళు చేయడం వల్ల పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థికంగా ఇబ్బందికరంగా మారిందని తల్లిదండ్రులు వాపోతున్నారు.

ఏది ఏమైనా పరీక్షల ముందు విద్యార్థులను, చిన్నారులను సంవత్సరం అంతా చదివిన చదువంతా ఈ ఒత్తుళ్ళు వల్ల మెరుగైన ఫలితాలను సాధించలేని దుస్థితికి దారితీసే ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాల పై సంబంధిత ప్రభుత్వ ఉన్నతాధికారులు చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రుల సంఘాలు, ప్రజా సంఘాలు విజ్ఞప్తి చేస్తున్నాయి

# ఇండియా పోస్ట్ ఆధ్వర్యంలో లక్కొండలో డాక్ చౌపాల్

**గ్రామీణులకు పోస్టల్ సేవలపై విస్తృత ప్రచారం**

**గంగవరం పెన్ పవర్, ఫిబ్రవరి 18:**గ్రామీణ ప్రజలకు పోస్టల్ శాఖ అందిస్తున్న వివిధ సేవలు, సేవింగ్స్ పథకాలు, బీమా సౌకర్యాలు మరియు డిజిటల్ లావాదేవీలపై అవగాహన కల్పించే ఉద్దేశంతో ఇండియా పోస్ట్ ఆధ్వర్యంలో లక్కొండ గ్రామంలో డాక్ చౌపాల్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు రంపచోడవరం సబ్ డివిజన్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోస్ట్స్ తాతు నాయుడు తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రంపచోడవరం సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోస్ట్స్ తాతు నాయుడు, లక్కొండ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. రఘు, గంగవరం సబ్ పోస్టుమాస్టర్ మోహన్ హాజరై గ్రామీణులను ఉద్దేశించి మాట్లాడారు. డాక్ చౌపాల్ ద్వారా పోస్టల్ సేవింగ్స్ ఖాతాలు, పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్, రూరల్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ , డిజిటల్ సేవలు, కేంద్రరాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు విధానం వంటి అంశాలపై ప్రజలకు వివరించారు.గ్రామీణ ప్రాంతాల్లో పోస్టల్ సేవలను సురక్షితంగా, సులభంగా వినియోగించుకునేలా చైతన్యం కల్పించడమే ఈ కార్యక్రమాల ప్రధాన లక్ష్యమని అధికారులు తెలిపారు. ఇటువంటి అవగాహన కార్యక్రమాలు గ్రామీణ ఆర్థికాభివృద్ధికి దోహదపడతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పోస్టల్ అధికారులు, సిబ్బంది, గ్రామ పెద్దలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## గిరిజన రైతులకు మెయింటెనెన్స్ రుణాలపై సమగ్ర

# ప్రతిపాదనలు సిద్ధం చేయాలి



**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్ ఫిబ్రవరి 19 :** పోలవరం జిల్లాలో గిరిజన రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా అగ్రికల్చర్, హార్టికల్చర్, ఫిషరీస్, పశుసంవర్ధక శాఖల ద్వారా మెయింటెనెన్స్ రుణాలు మంజూరు చేయుటకు సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని బచ్చు స్మరణ్ రాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు.గురువారం స్థానిక ఐటిడిఏ సమావేశపు హాలులో నాబార్డ్, వివిధ శాఖల అధికారులు, బ్యాంకు ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయం చేస్తున్న రైతుల సంఖ్య, పండిస్తున్న పంటలు, ఒక్క ఎకరానికి అయ్యే మెయింటెనెన్స్ ఖర్చు, అవసరమైన రుణాల వివరాలతో నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు.హార్టికల్చర్ పంటల విస్తీర్ణం, ఒక్క ఎకరానికి ఖర్చు, అవసరమైన రుణాలపై వివరాలు సమర్పించాలన్నారు. అలాగే మత్స్యశాఖ ద్వారా చేపల పెంపకం జరుగుతున్న ఎకరాలు, ఖర్చులు,

**ఐటిడిఎ పీవో, జాయింట్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్ ఆదేశం**

అవసరమైన రుణాలపై నివేదిక ఇవ్వాలని తెలిపారు. పశుసంవర్ధక శాఖ ద్వారా జిల్లాలో ఉన్న పాడి పశువుల సంఖ్య, ఒక్క రైతుకు అయ్యే మెయింటెనెన్స్ వ్యయం, అవసరమైన రుణాల వివరాలను సమగ్రంగా సిద్ధం చేయాలని ఆదేశించారు. 2025-26, 2026-27 ఆర్థిక సంవత్సరాలకు రైతులకు మెయింటెనెన్స్ రుణాలు మంజూరు చేసి, తిరిగి చెల్లింపులు సక్రమంగా జరిగేలా బ్యాంకుల సమన్వయంతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో డిసిసిబి డీజీఎం శ్రీధర్, నాబార్డ్ డీడీఎం సోము నాయుడు, పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డా. షరీఫ్, జిల్లా మత్స్యశాఖ అధికారి షేక్ దిల్షాద్, ఏడిఏ రామమోహన్ రావు, బ్యాంక్ మేనేజర్లు గొర్లె బుజ్జిబాబు, మురళీమోహన్, ఎన్. రమేష్ కుమార్, ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

# హిందూ స్మశాన వాటిక ప్రాంగణం పున: ప్రారంభం







**టీ నర్సాపురం, పెన్ పవర్, ఫిబ్రవరి 19 :** హిందూ స్మశాన వాటిక ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన ఆర్చ్, శివ విగ్రహాన్ని, హరిచంద్ర విగ్రహాన్ని, మోటారు,వాటర్ ట్యాంకు,,షెడ్డును గురువారం గ్రామ పెద్దలు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా పున: నిర్మాణానికి పునాదివేసిన కటకంకొండ, కమ్మిలరమేష్ రాజు,సురేష్ రాజులకు స్థానిక సర్పంచ్ సునంద,దేవరపల్లి ముత్తయ్య,మరియు గ్రామస్తులు కలిసి దుశాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా హిందూ స్మశాన అభివృద్ధి కమిటీ సభ్యుడుమరీదుశ్రీ మాట్లాడుతూహిందూ స్మశానాన్ని సుమారు 20 లక్షల రూపాయల దాతలు సహకారంతో అభివృద్ధి చేసి సుందర వనముగా తీర్చిదిద్దిన కటకం వెంకటేశ్వరావు(కొండ)కు కృతజ్ఞతలు తెలియజేశారు. గత రెండు మూడు సంవత్సరాలుగా స్మశాన వాటిక అభివృద్ధి కోసం నిరంతరం శ్రమ పడుతున్న వెంకటేశ్వరరావు మరియు వారి టీం చేసే సేవ మరువలేనివి అన్నారు ఒకప్పుడు స్మశాన వాటిక వద్దకువెళ్ళడానికి భయపడేవారు ఇప్పుడు ఒక పార్కు లాగా ఉండటంతో అందులోకి వెళ్లి భయం లేకుండా కూర్చుంటున్నారన్నారు. స్మశాన వాటిక అభివృద్ధికి సహకరించిన ప్రతి ఒక్క దాతకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో శివరామకృష్ణ, చింతవంశీ యశోద వెంకటేశ్వరరావు,జోను బోయిన సోంబాబు,పసుమర్తి రాము,మండం సత్యనారాయణమూర్తి,పర్వతనేని మురళి, పాలేటి సత్యనారాయణ, దేవరపల్లి రంగారావు,కటకం మల్లయ్య, అనుమోలు వెంకట శ్రీనివాస్, అద్దంకి జగ్గారావు కుప్పల బాబు, పబ్బు జయరాజు,కన్నం శ్రీనివాస్,చేబోలు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# పోలవరం డీఆర్‌డీఏ పీడీగా డా. దాసరి రత్నాకరరావు బాధ్యతలు స్వీకారం



**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్ ఫిబ్రవరి 19 :**పోలవరం (రంపచోడవరం) జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా డాక్టర్ దాసరి రత్నాకరరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. రంపచోడవరం వెలుగు ఏపిడీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఇప్పటివరకు ఐటీడీఏ వెలుగు ఏపిడీగా పనిచేసిన సిరిగిరి దేగలయ్య తన బాధ్యతలను రత్నాకరరావుకు అప్పగించారు.కార్యాలయ అవసరాల దృష్ట్యా డాక్టర్ దాసరి రత్నాకరరావును పోలవరం జిల్లా డీఆర్‌డీఏ పీడీగా నియమిస్తూ సెర్ప్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వి. కరుణ ఉత్తర్వులు జారీ చేశారు.ప్రస్తుతం విజయనగరం జిల్లా డీఆర్‌డీఏలో అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న రత్నాకరరావు బదిలీపై పోలవరం జిల్లాకు వచ్చారు. ఆయనకు గ్రామీణాభివృద్ధి రంగంలో విస్తృత అనుభవం ఉందని అధికారులు తెలిపారు.ఇదిలా ఉండగా రంపచోడవరం ఐటీడీఏ వెలుగు ఏపిడీగా పనిచేసిన సిరిగిరి దేగలయ్యను రిలీవ్ చేశారు. దేగలయ్యను విజయవాడలోని సెర్ప్ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని సీఈఓ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షునిగా ముచ్చకర్ల నియమకం



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 20** సమాజంలోని ఇతర కులాలు సైతం అభినందించే పందా లో వెనకబడిన కులాలను సమున్నత స్థాయికి అభివృద్ధి పరచే విధంగా కృషి చేద్దామని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షునిగా ముచ్చకర్ల సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఇటీవల మంగళగిరిలో రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం కార్యాల యంలో జరిగిన కార్యక్రమంలో ముచ్చుకర్లను జిల్లా అధ్యక్షునిగా నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకర్రావు ప్రకటించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ముచ్చకర్ల మాట్లాడుతూ,రాబోయే తరాల కోసం సమానత్వ సమాజాన్ని ఆవిష్కరిద్దామని, రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకర్రావు ఉన్నత లక్ష్యాలను నెరవేర్చే పందా లో వారికి బాసటగా నిలుద్దామన్నారు. స్థానిక కంబాల చెరువు వద్ద గల జిల్లా బీసీ సంఘం కార్యాలయంలో జరిగిన అభినందన సభ లో బీసీ నగర రూరల్ అధ్యక్షులు బిల్డర్ చిన్న , ఏ వి వి సత్యనారాయణ బోఖం సింహాచలం, వల్లూరి వీర వెంకటరమణ కర్నాటి శంకర్, వెన్న సత్యనారాయణ, నార్గణ వసంత కుమార్, ఎం రాజేంద్రప్రసాద్, దొండపాటి శ్యాం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

# విద్యార్థులకు రైల్వే భద్రతపై అవగాహన సదస్సు




**పెన్ పవర్, ఉంగుటూరు ఫిబ్రవరి 19:**ఉంగుటూరు మండలం కైకరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు రైల్వే భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన (ఆర్పీఎఫ్) ఏలూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ కె. బెనయ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు.

రైల్వే ఆస్తులకు ఎటువంటి నష్టం కలిగించకూడదని, రైల్వే ట్రాక్‌ల వద్ద ప్రమాదకరంగా తిరగరాదని ఆయన సూచించారు. ముఖ్యంగా సెల్‌ఫోన్‌లలో సెల్ఫీలు తీసుకోవడానికి ట్రాక్‌ల దగ్గరకు వెళ్లడం ప్రమాదకరమని హెచ్చరించారు. రైలులో ప్రయాణించే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, సురక్షిత ప్రయాణమే ప్రథమ కర్తవ్యమని తెలియజేశారు.

విద్యార్థులు మంచి క్రమశిక్షణతో ప్రవర్తిస్తూ, ఎటువంటి చెడు అలవాట్లకు లోనుకాకుండా తమ లక్ష్య సాధన దిశగా ముందుకు సాగాలని సూచించారు. ఉపాధ్యాయులను మార్గదర్శకులుగా తీసుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్. శ్రీనివాస్, ఆర్పీఎఫ్ ఏఎస్ఐ ఏ. రామారావు, పాఠశాల ఉపాధ్యాయులు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు. విద్యార్థులు ఆసక్తిగా కార్యక్రమంలో పాల్గొని సందేహాలు నివృత్తి చేసుకున్నారు.

# ఎల్.ఆర్.ఎస్.ను సద్వినియోగం చేసుకోవాలి

- కమిషనర్ రాహుల్ మీనా



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 20:**ప్రభుత్వం కల్పించిన ప్లాట్ల లేఅవుట్ క్రమబద్దీకరణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ రాహుల్ మీనా సూచించారు. గురువారం టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో ఆయన పర్యటించారు. లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్(ఎల్ఆర్ఎస్) దరఖాస్తుల పరిష్కారానికిగాను ఏవీ అప్పారావు రోడ్డు, ఎస్.బి.ఐ. కాలనీ, కోరుకొండ రోడ్డులోని పలు కాలనీలలో పర్యటించి అనుమతులు మంజూరు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం కు ఏప్రిల్ 23 వరకు, బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం కు మార్చి 11 వరకు ప్రభుత్వం అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఆయా దరఖాస్తులను అధికారులు పరిశీలించి వెంటనే అనుమతి మంజూరు చేస్తారని వివరించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసిందిగా సూచించారు. ఏప్రిల్ 23 అనంతరం అనధికారిక లేఅవుట్లలో గల ప్లాట్ల యందు భవన నిర్మాణ అనుమతులు మంజూరు చేయబోమని స్పష్టం చేశారు. ఆయన వెంట సిటీ ప్లానర్ జి.వి.ఎస్.ఎన్.మూర్తి, డీసీపీ పి.శ్రీనివాస్, ఏసీపీలు కొండలరావు, శ్రీనివాసరావు, ఇతర టౌన్ ప్లానింగ్ సిబ్బంది ఉన్నారు.

# నేడుఆల్కట్ గార్డెన్స్ లో వయో వృద్ధుల నైపుణ్యాభివృద్ధి సదస్సు

- జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 20:**తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని సిటిజన్ల కోసం జాతీయ , రాష్ట్ర కార్యాచరణ ప్రణాళిక ల పథకాల అమలులో భాగంగా వయో వృద్ధుల ఉత్పాదక వృద్ధాప్యం కోసం నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, వర్క్‌షాపులు , మెడికల్ క్యాంపులు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ కలెక్టర్ కీర్తి చేకూరి బుధవారం తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వ విభిన్న ప్రతిభావంతుల, హిజ్రాల , వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు తూర్పు గోదావరి జిల్లాలో ఫిబ్రవరి 21 వ తేదీన వయో వృద్ధుల కోసం శ్రీ గేదెల నూక రాజు కళ్యాణ మండపంలో నైపుణ్యాభివృద్ధి వర్క్‌షాపులు, మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఫిబ్రవరి 21 వ తేదీన ఉదయం 11.00 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు సంగీతం, క్రాఫ్ట్ తయారీ, పెయింటింగ్, డ్రాయింగ్, పాటలు పాడడం, చిన్న కథలు రచించడం, క్యారమ్స్ , వాకింగ్ పోటీలు, కుండల తయారీ తదితర కార్యకలాపాలపై వర్క్‌షాపులు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఉదయం 9.00 గంటల నుండి 11.00 గంటల వరకుకళ్యాణ మండపంలో డిమెన్షియా స్క్రీనింగ్, షుగర్ పరీక్షలు, బి.పి చెకింగ్ వంటి వైద్య పరీక్షలతో మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా పరిధిలోని వయో వృద్ధులు ఈ కార్యక్రమాలకు హాజరై ప్రయోజనం పొందాలని కలెక్టర్ కీర్తి చేకూరి కోరారు.

సహాయ సంచాలకులు వై. శ్రీనివాస్ వద్ద నమోదు వివరాలు తెలియ చేస్తూ, ఆసక్తి గల వారు తమ పేర్లను గుబ్బల రాంబాబు (ఫోన్: 9550160167) లేదా నరసింహరావు (ఫోన్: 9441174636) వద్ద తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమాలకు హాజరయ్యే వారు తప్పనిసరిగా వయస్సు నిర్ధారణ గుర్తింపు కార్డు తీసుకురావాలని ఆయన తెలియజేశారు.

# ఓటమి ఎరుగని ధీరుడు ఛత్రపతి శివాజీ




ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ దినేష్ శంకర్ రెడ్డి.

**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. ఫిబ్రవరి 19.**భారతదేశ గౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన ధీరుడు, ఓటమి ఎరుగని మహావీరుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ అని ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్.పి.దినేష్ శంకర్ రెడ్డి కొనియాడారు. ఏపీ నిట్ గ్రంధాలయ చైర్మన్, ఆచార్యులు డాక్టర్ కార్తికేయ శర్మ ఆద్వర్యంల్ ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి కార్యక్రమాన్ని స్థానిక గ్రంధాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిధి డాక్టర్ దినేష్ శంకర్ రెడ్డి మాట్లాడుతూ భారతదేశం గర్వించదగ్గ రాజుల్లో శివాజీ మహారాజ్ ఒకరని , తన ఊపిరి ఆగిపోయేవరకు స్వతంత్ర భారతం కోసం పాటుపడిన పోరాట యోధుడని కొనియాడారు. 17 ఏళ్ల వయస్సులోనే యుద్ధ భూమిలోకి అడుగు పెట్టి శత్రువులను చీల్సి చెండాడని తెలిపారు. గెరిల్లా యుద్ధాన్ని ప్రపంచానికి పరిచయం చేయటంతోపాటు సువిశాల మరాఠా సామ్రాజ్యాన్ని నెలకొల్పిన గొప్ప ధీశాలి శివాజీ అన్నారు. రణ రంగంలో మొగలులను సమర్థవంతంగా ఎదుర్కోవటంతోపాటు ప్రజా సంక్షేమం కోసం అహోర్నిశలు పాటుపడిన యోధుడిగా శివాజీ కీర్తించబడ్డారని చెప్పారు. శివాజీ భవానీ భక్తుడైనప్పటికీ అన్ని మాతాలను సమానంగా ఆదరిస్తూ ప్రజల అభిమానాన్ని చూరగొన్నారని వివరించారు. ముందుగా శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆచార్యులు డాక్టర్ తేజావతు రమేష్, డాక్టర్ రాజేశ్వర రెడ్డి, డాక్టర్ కృష్ణ చైతన్య, డాక్టర్ శరత్ ద్వివేది, అసిస్టెంట్ లైబ్రేరియన్ కమల మహంతి, సూపరింటెండెంట్ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# అబుదాబి ఓపెన్ టెన్నిస్ ఈవెంట్స్ లో నగర క్రీడాకారుడి ప్రతిభ

- 3 మెడల్స్ సాధించిన విజేతకు
- ఎమ్మెల్యే ఆదిరెడ్డి అభినందన



**రాజమహేంద్రవరం , పెన్ పవర్, ఫిబ్రవరి 20** అబుదబిలో ఈ నెల 6 నుంచి 15వ తేదీ వరకూ ఘనంగా నిర్వహించిన 2026 "ఓపెన్ మాస్టర్ గేమ్స్" టెన్నిస్ పోటీల్లో నగరానికి చెందిన క్రీడాకారుడు, ముదునూరి సత్య రాజ ఇంద్ర రాజు అంతర్జాతీయ వేదికపై తన ప్రతిభను చాటుతూ విజయాలను నమోదు చేశారు. ఈ అంతర్జాతీయ టోర్నమెంట్ లో భారతదేశం తరపున మెన్స్ 40 ప్లస్ సింగిల్స్, డబుల్స్ , మిక్స్ డబుల్స్ టెన్నిస్ ఈవెంట్లలో పాల్గొన్న ఇంద్రరాజు 3 కాంస్య మెడల్స్ సాధించారు. ఈ విజయాన్ని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌తో పంచుకోగా మూడు మెడల్స్ సాధించిన ఆయన్ను అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ టెన్నిస్ ఈవెంట్‌లో ప్రాంతీయ ఆటగాడు దేశానికి గౌరవం తెచ్చేలా పతకాలు సాధించడం అభినందనీయమన్నారు. సత్య రాజ ఇంద్రరాజు మాట్లాడుతూ, గ్లోబల్ సీనియర్ టెన్నిస్ అసోసియేషన్ ఆల్ ఇండియా ర్యాంకింగ్ టోర్నీల్లో పాల్గొంటూ విజయాలు సాధించి ర్యాంకింగ్ పాయింట్లు సేకరించి అబుదాబి ఈవెంట్‌కు భారతదేశం తరపున ప్రాతినిధ్యం వహించే అర్హత పొందనన్నారు. తాను ఈ పతకాలు సాధించేందుకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రోత్సాహం ఉందన్నారు. మూడేళ్ల తన పోరాటమన్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు టెన్నిస్ స్పోర్ట్సుకు ప్రోత్సాహం ఇస్తూ, క్రీడలకు మౌలిక సదుపాయాలు, సౌకర్యాలు కల్పించడం జరుగుతోందన్నారు. తన విజయం నగర యువతను క్రీడల పరంగా ముందుకు సాగేలా ప్రేరేపిస్తుందని ఇంద్రరాజు ఆకాంక్షించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఇంద్రరాజును ప్రశంసిస్తూ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తూ దేశానికి పతకాలను తీసుకురావాలని ఆకాంక్షించారు.

# అంగన్ వాడీ కేంద్రానికి కోతులు,పశువుల బెడద



**ఏలూరు ఫిబ్రవరి 19 పెన్‌పవర్** :ఏలూరు ప్రాజెక్టు పరిధిలోని ఏలూరు రూరల్ మండలం కోటేశ్వర దుర్గాపురం గ్రామంలో 110 అంగన్ వాడీ సెంటర్‌కు రక్షణ గోడ లేక కోతులు,పశు వులు ప్రవేశించి అంగన్ వాడీ కేంద్రానికి సంభందించిన పోషణ్ కేంద్రంలో పెంచే కూరగాయల మొక్కలను పశువులు మేసేస్తున్నాయని పోషణ్ వాటిక చుట్టూ అమర్చిన తెరను కోతుల పీకిపాడేస్తున్నాయని అంగన్ వాడీ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అంగన్ వాడీ కేంద్రానికి చుట్టూ ప్రహరీ గోడ లేక పోషణ్ వాటికకు భద్రత లేకుండా పోయింది.అధికారులు స్పందించి అంగన్ వాడీ కేంద్రానికి రక్షణ గోడ నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని చిన్నారుల తల్లి తండ్రులు,ప్రజలు కోరుతున్నారు

## ఆవాస్ యోజన ఇళ్ల నిర్మాణం వేగవంతానికి లబ్ధిదారులతో హౌసింగ్ పి.డి



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 20**
నగరం లో పిఎంఏవై 2.0 పథకం క్రింద మంజూరైన 420 గృహాలలో భాగంగా సంజీవ నగర్, సుబ్బారావు నగర్ ప్రాంతాలలో ఉన్న లబ్ధిదారులను బుధవారం పి.డి హౌసింగ్ నాతి బుజ్జి స్వయంగా కలిసి గృహనిర్మాణ పురోగతిని పరిశీలించారు. యూనిట్ విలువ రూ. 2.50 లక్షలతో ప్రభుత్వం అందిస్తున్న ఈ గృహాలను నిర్దిష్ట కాలవ్యవధిలో పూర్తి చేసుకోవాలని లబ్ధిదారు లకు సూచించారు.
ఇళ్ల నిర్మాణం త్వరిగతిన పూర్తి చేసుకునే విధంగా అవసరమైన సాంకేతిక మార్గదర్శకాలు, ఆర్థిక వినియోగంపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీని సక్రమంగా వినియోగించుకొని నాణ్యతతో గృహాలను నిర్మించుకోవాలని లబ్ధిదారులను ప్రోత్సహించారు.
గృహనిర్మాణ ప్రక్రియలో ఇబ్బందులు ఎదురైనా సంబంధిత అధికారులను సంప్రదించాలని, ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని పూర్తిగా వినియోగించు కోవాలని ఆమె సూచించారు.

## హిందూ హృదయ సామ్రాట్ ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి శోభాయాత్ర





**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. ఫిబ్రవరి 19.**స్పందన ఫౌండేషన్ తాడేపల్లిగూడెం ఆధ్వర్యంలో హిందూ హృదయ సామ్రాట్ ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా స్థానిక తాడేపల్లిగూడెం హౌసింగ్ బోర్డ్ కాలనీ వద్దగల ఆంజనేయ స్వామి ఆలయం వద్ద నుంచి శోభాయాత్ర ( బైక్ ర్యాలీ ) నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎన్ఐటి డీన్ జి . ఆర్ కే శాస్త్రి , నవోదయ ఫ్రెండ్స్ యూనియన్ అధ్యక్షులు ఎగ్గిన నాగబాబు , ఆర్ఎస్ఎస్ నాయకులు అశోక్ కుమార్ తదితరులు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు జండా ఊపి బైక్ ర్యాలీని ప్రారంభించారు , వారు మాట్లాడుతూ శివాజీ సుమారు 400 సంవత్సరాల క్రితమే హిందూ ధర్మ పరిరక్షణ కోసం ప్రాణాలను సైతం పణంగా పెట్టి హిందూ ధర్మాన్ని కాపాడిన గొప్పవీరుడని అన్నారు నేటి యువతరానికి చత్రపతి ఒక ఆదర్శప్రాయుడని కొనియాడారు . స్పందన ఫౌండేషన్ చైర్మన్ శ్రీమతి భోగి రెడ్డి ఆదిలక్ష్మి మాట్లాడుతూ భారతీయులంతా చత్రపతి శివాజీని ఆదర్శంగా తీసుకొని సనాతన ధర్మ పరిరక్షణ కోసం ముందుకు రావాలని. మాతృమూర్తులందరూ శివాజీ తల్లి జిజియా బాయ్ ని ఆదర్శంగా తీసుకుని తమ పిల్లలను సనాతన ధర్మ పరిరక్షణ కోసం సమాజానికి అందించాలని పిలుపునిచ్చారు , హౌసింగ్ బోర్డ్ వద్ద ప్రారంభమైన బైక్ ర్యాలీ తాడేపల్లిగూడెం పట్టణ ప్రధాన రహదారుల్లో సాగింది సుమారు ఎనిమిది కిలోమీటర్ల మేర సాగిన ఈ యాత్ర ఆధ్యాంతం యువకులు హుషారుగా పాల్గొన్నారు . ఈ కార్యక్రమంలో స్పందన ఫౌండేషన్ సభ్యులు , ఏబీవీపీ నాయకులు, బిజెపి నాయకులు, మరియు పట్టణ పుర ప్రముఖులు పాల్గొన్నారు

## తలశిల రఘురామ్ కు వైసీపీ తాడేపల్లిగూడెం ఇంచార్జి వడ్డి రఘురామ్ పరామర్శ"



**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. ఫిబ్రవరి 19.**శాసన మండలి సభ్యులు తలశిల రఘురామ్ తండ్రి, తలశిల చంద్రశేఖర్ రావు గారి మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసిన మాజీ అప్పడా వైస్ చైర్మన్ ,తాడేపల్లిగూడెం నియోజకవర్ వైసీపీ కోఆర్డినేటర్ వడ్డి రఘురామ్ గొల్లపూడి లోని తలశిల రఘురామ్ నివాసానికి వెళ్లి, పరామర్శించి, చంద్రశేఖర రావు కి నివాళులర్పించిన వడ్డి రఘురామ్ ఈ కార్యక్రమంలో వైసీపీ గూడెం నాయకులు పాల్గొన్నారు.

# సృజనాత్మక యువతకు ప్రపంచ స్థాయి ఉపాధి





సమ్మిట్ 2026 ముగింపు సభ లో కలెక్టర్ కీర్తి చేకూరి

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 20:**రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఆధ్వర్యంలో, ఏ పి వాగా ఎక్స్ ఆర్ సంయుక్త సహకారంతో ఈ నెల 18, 19 తేదీలలో ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన ఏ పి వాగా ఎక్స్ ఆర్ సమ్మిట్ 2026 గురువారం విజయవంతంగా ముగిసింది.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ, యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్ , ఎక్స్టెండెడ్ రియాలిటీ రంగాల్లో అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలపై విద్యార్థులు, పరిశ్రమ నిపుణులు ఒకే వేదికపై చర్చించుకునే అవకాశాన్ని ఈ సమ్మిట్ కల్పించిందన్నారు. ఈ రంగంలో ప్రపంచవ్యాప్తంగా విస్తృతమైన ఉపాధి అవకాశాలు ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. ఉద్యోగాలను కోరుకునే వారిగా కాకుండా, ఉద్యోగాలను సృష్టించే వారిగా ఎదగాలని యువతకు పిలుపు నిచ్చారు. ప్రభుత్వం తరపున సహకారం అందించేందుకు సిద్ధంగా తాము ఉన్నామని తెలిపారు. యువతలో నైపుణ్యం గుర్తించి, నూతన ఆవిష్కరణలు ప్రోత్సహించే దిశలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ కీలకం గా నిలనున్నదన్నారు.జాయింట్ కలెక్టర్ , రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ డైరెక్టర్ వై. మేఘ స్వరూప్ మాట్లాడుతూ యువత తమ వినూత్న ఆలోచనలను కార్యరూపంలోకి తీసుకురావడానికి ఈ వేదికను వినియోగించుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యం మేరకు "ఒక కుటుంబం ఒక పారిశ్రామికవేత్త" ప్రతి కుటుంబం నుంచి కనీసం ఒకరు వ్యాపారవేత్తగా ఎదగాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపల్ డా. ఆర్.కే. రామచంద్ర విద్యార్థులు విద్యను నైపుణ్యాలతో అనుసంధానించి ఆధునిక సాంకేతిక రంగాల్లో అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.
రెండవ రోజు నిర్వహించిన సాంకేతిక సదస్సుల్లో పరిశ్రమ నిపుణులు వి ఎఫ్ ఎక్స్ ఫిల్మ్ మేకింగ్, ఏ ఆర్, వి ఆర్, ఎక్స్ ఆర్, సాంకేతికతలపై సమగ్ర అవగాహన కల్పించారు. క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అంద జేయడం తో కార్యక్రమం ముగిసింది.ఈ కార్యక్రమంలో హబ్ హెడ్ ఇన్‌క్యుబేషన్ కామన చంద్ర ప్రకాష్, హెడ్ ల్యాబొరేటరీటెస్టింగ్ డా. జి. సౌజన్య, ఏపీ వాగా అధ్యక్షులు బాల బాలాజీ రుద్ర, వైస్ ప్రెసిడెంట్ శ్రీధర్ రెడ్డి, సెక్రటరీ మేఘన తిరుమల శెట్టి, దేవ్ గాంధీ, గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపల్ డా. ఆర్.కే. రామచంద్ర, ఇన్‌క్యుబేషన్ సెంటర్ కోఆర్డినేటర్ డా. బేబీ నిర్మల, వివిధ కళాశాలల విద్యార్థులు పరిశ్రమ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పొ. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి


# 10వ తరగతి విద్యార్థుల ఎగ్జామ్ కిట్‌లు, ఫైల్ ఫోల్డర్‌లు పంపిణీ





**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. ఫిబ్రవరి 19.**
నూతనంగా స్థాపించబడిన రక్ష భారత్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ (రి. నెం. 52/2026) ఆధ్వర్యంలో మార్కొండపాడు గ్రామంలోని జడ్పీ ఎచ్చ్ పాఠశాలలో చదువుతున్న 10వ తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించరు. పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో సుమారు 60 మంది విద్యార్థులకు అవసరమైన ఎగ్జామ్ కిట్‌లు మరియు ఫైల్ ఫోల్డర్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏపీ జెన్ కో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ చీఫ్ శ్రీ బొల్లా సుబ్బారావు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, క్రమశిక్షణ, కష్టపడి చదవడం మరియు లక్ష్యసాధనతోనే జీవితంలో ఉన్నత స్థానాన్ని సంపాదించవచ్చని ప్రేరణాత్మక సందేశం అందించారు. అనంతరం ఆయన విద్యార్థులకు పరీక్షా సామగ్రిని అందజేశారు.
సంస్థ అధ్యక్షుడు అల్లాడి బాలాజీ మాట్లాడుతూ, సమాజంలో మార్పు తీసుకురావాలంటే విద్యే ప్రధాన ఆయుధమని, ప్రతి విద్యార్థి తమ పరిస్థితులను అధిగమించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమానికి సహకరించి అనుమతి ఇచ్చిన జడ్పీ ఎచ్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ పి.రమణ మూర్తి కి సంస్థ తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు.
ఈ కార్యక్రమం విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, పరీక్షలకు మరింత ఉత్సాహంతో సిద్ధమయ్యేలా ప్రేరణనిచ్చింది.

## నట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ముళ్ల పొదలు



**ఏలూరు ఫిబ్రవరి 19 పెన్‌పవర్ :** భీమడోలు మండలం ఆగడాల లంక గ్రామం నుండి చెట్టున్నపాడు వేళ్లే ప్రధాన ర---హదారిపో తిటో ఉంది : 19 ఇఎల్ఆర్-4 ట్రాన్స్ ఫార్మర్ చుట్టూ ముళ్ల పొదలతో నిండి ప్రమాదకరంగా మారింది.వీటి వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది.ట్రాన్స్ కో అధికారులు స్పందించి ట్రాన్స్ ఫార్మర్ చుట్టూ ఉన్న ముళ్ల పొదలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

## డ్వాక్రా సంఘాలు బలోపేతానికి ఐఎస్‌బీ అధ్యయన బృందం పర్యటన



**పెన్ పవర్, ఉంగుటూరు ఫిబ్రవరి 19**
ఇండియన్ స్కూల్స్ ఆఫ్ బిజినెస్ కు చెందిన అధ్యయన బృందం గురువారం ఉంగుటూరు మండలంలోని కైకరం, ఉంగుటూరు గ్రామాల్లో పర్యటించింది. డ్వాక్రా (స్వయం సహాయక) సంఘాల బలోపేతంపై అధ్యయనం నిర్వహించేందుకు వచ్చిన బృందం సంఘాల సభ్యులతో ముఖాముఖి సమావేశం నిర్వహించింది.
ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘాల ప్రస్తుత స్థితిగతులు, పనితీరు, ఎదుర్కొంటున్న సవాళ్లు, భవిష్యత్ అవకాశాలు తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. ముఖ్యంగా మహిళలకు స్థిరమైన జీవనోపాధి అవకాశాలు కల్పించే విధంగా చేపట్టవలసిన అభివృద్ధి కార్యక్రమాలపై సభ్యుల అభిప్రాయాలను సేకరించారు.
డ్వాక్రా సంఘాలను మరింత బలోపేతం చేయడానికి ఆర్థిక వనరుల విస్తరణ, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు, మార్కెటింగ్ సదుపాయాల పెంపు వంటి అంశాలపై సూచనలు పొందినట్లు బృందం సభ్యులు తెలిపారు.
ఈ కార్యక్రమంలో పీడీ విజయలక్ష్మి, ఉంగుటూరు మండల ఏపీఎం కే. ప్రభావతి తదితర సిబ్బంది పాల్గొన్నారు. అధ్యయన బృందం సేకరించిన వివరాల ఆధారంగా సమగ్ర నివేదిక రూపొందించి సంబంధిత అధికారులకు సమర్పించనున్నట్లు తెలిసింది.

## జల జీవన్ మిషన్ పనులకు శంకుస్థాపన





**గంగవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 19:**మండలంలోని ఆమదాల బంధ రాజాంపాలెం గ్రామాల్లో జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి కుళాయిలు ఏర్పాటు పనులకు గురువారం ఎంపీపీ కృష్ణారెడ్డి శంకుస్థాపన నిర్వహించారు. ఆర్డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస్ ఆధ్వర్యంలో చేపట్టిన కుళాయిల ఏర్పాటు వాటర్ ట్యాంక్ మరమ్మత్తుల పనులను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం రాజంపాలెం జిపిఎస్ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాల గురించి ఆరా తీశారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల విద్యాబోధన జరగాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ సక్రమంగా అమలు చేయాలని సూచించారు. ఆయన వెంట డిప్యూటీ ఎంపీడీవో గోపన్న దొర, ఆర్ డబ్ల్యు ఎస్ ఏ ఈ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ కుంజం వెంకటేశ్వర్లు దొర ,ఎంపీటీసీ పండా ఆదినారాయణ దొర తదితరులు ఉన్నారు.

# ఆగడాలలంలో సమస్యలదే రాజ్యం






**వియన్నపేటలో మౌళిక వసతులు కరవు**

**ఏలూరు ఫిభ్రవరి 19 పెన్‌పవర్ :** భీమడోలు మండలం ఆగడాల లంక గ్రామంలో మౌలిక వసతుల లేమి ప్రజలను పీడిస్తోంది.మురుగునీటి కాలువలు నిర్మించాల్సి ఉంది.గ్రామంలో పారిశుధ్య నిర్వహణ లేక పోవడంతో డ్రైనేజీలలో మురుగు ముందుకు కదలడం లేదు.వియన్నపేటలో రోడ్‌పై భవన నిర్మాణ సామగ్రి వేయడంతో ఆవీధిగుండా రాకపోకలు సాగించడానికి పాదచారులు,వాహన దారులు ఇబ్బంది పడుతున్నారు.గ్రామ పంచాయితీ పరిధిలోని కమ్మగూడెం,ఊరకోడు,గణేష్‌సెంటర్.నాగులపేట,ప్రాంతాలలో పారిశుధ్య సమస్యలు తాండవిస్తున్నాయి.గ్రామంలో మౌలిక వసతులు కల్పించి పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని గ్రామస్థులు కోరుతున్నారు.ఇన్చార్జిపాలనలో సచివాలయం: ఇటీవల గ్రామ పంచాయితీ కార్యదర్శి పదన్నతిపై వేరే జిల్లాకు బదిలీపై వెళ్లారు.ఆయన స్దానంలో ఇన్చార్జి కార్యదర్శికి బాద్యతలు అప్పగించారు.ఇన్చార్జి కార్యదర్శికి ఫుల్ అడిషనల్ చార్జి ఇవ్వకపోవడంతో కార్యకలాపాలు అంతంత మాత్రంగానే జరుగుతున్నాయి.పన్నుల వసూళ్లలో ఇబ్బంది పడుతున్న కార్యదర్శులు : ఈనెల 10 తేదీలోగా ఇంటి పన్నులు వసూలు ప్రక్రియ పూర్తి చేయాలని పంచాయితీ రాజ్ కమీషనర్,జిల్లా మంత్రంగం ఒత్తిడితో పండల పరిషత్ అధికారలు కార్యదర్శులపై భారం మోపుతున్నారు.లంకగ్రామాల్లోకార్యదర్శులు అంతర్జాలం,మైగ్రేషన్,సమస్యలతోసతమతమవుతన్నారు.గ్రామాలలో ప్రజలు వలసలు వెల్లి పోవడంతో ప్రజలు అందుబాటులో లేక ఇంటిపన్నులు,కుళాయి పన్నులు వసూళ్లలో జాప్యం తలెత్తి వసూళ్లలో జాప్యం ఏర్పతోందని మండలంలో కార్యదర్శులు చెబుతున్నారు.ఈ పరిస్దితుల్లో పన్నుల వసూళ్ల కార్యదర్శులకు గగనంగా మారింది.అధికారులు స్పందించి సచివాలయం కార్యదర్శులకు పూర్తి అదనపు బాద్యతలు అప్పగించి,గ్రామంలో పారిశుధ్యం,సమస్యలు పరిష్కరించాలని,మౌలిక వసతులు కల్పనకు చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## మామిడి పంట యాజమాన్య పద్ధతులపై మేధో మదన సదస్సు.





**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. ఫిబ్రవరి 19.**డా.వైయస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యాన శాఖ సమన్వయంతో ఆన్లైన్ ద్వారా ఈ మేధో మదన సదస్సు జరిగింది. రాష్ట్ర ఉద్యాన శాఖ డైరెక్టర్ డా. కే. శ్రీనివాసులు ఐఏఎస్ , ముఖ్యఅతిథిగా, వైయస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకొలపతి డాక్టర్ కె ధనుంజయ రావు అధ్యక్షులుగా మామిడి సీజన్లో తీసుకోవలసిన జాగ్రత్తలు యాజమాన్య పద్ధతులు సవివరంగా చర్చించడం జరిగింది మామిడి సాగులో మన దేశం ప్రపంచంలో మొదటి స్థానంలోనూ ఉత్పత్తిలో రెండవ స్థానంలోనూ ఉంది. దేశంలో మన రాష్ట్రం మామిడి సాగు లో రెండవ స్థానంలో ఉన్నప్పటికీ ఉత్పత్తిలో మన రాష్ట్రం దేశంలో మొదటి స్థానంలో ఉన్నది. ఆంధ్రప్రదేశ్లో ఏలూరు జిల్లా ఎన్టీఆర్ జిల్లా చిత్తూరు జిల్లా విజయనగరం జిల్లా కృష్ణ కాకినాడ అన్నమయ్య తిరుపతి అనంతపురం మరియు కడప జిల్లాల్లో మరియు కడప జిల్లాల్లో ఎక్కువ సాగు చేస్తున్నారు

మన రాష్ట్రం నుండి బంగినపల్లి రకం పండ్లను మరియు తోతాపూర్ గుజ్జును వివిధ దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రస్తుత సీజన్లో మామిడి మంచి పూత మీద ఉన్నట్లు ఉద్యాన శాఖ అధికారులు తెలియజేశారు.

కానీ తేనెమంచు నల్ల తామర బూడిద తెగులు వంటివి మామిడి పంటను పూత దశలోనే తీవ్ర నష్టం కలుగజేస్తున్నాయి. అన అనుకూలమైన వాతావరణ పరిస్థితులు ముఖ్యంగా రాత్రి చలి వాతావరణం పొగ మంచు పగటి అధిక ఉష్ణోగ్రతలు ఈ తెగుళు రావడానికి ప్రధాన కారణాలు.

విస్తారమైన మామిడి పూత వచ్చినప్పటికీ దాని నుండి కనీసం ఒక్క శాతం పిందెలు గా మారిన మంచి దిగుబడి వస్తుంది. కానీ వివిధ కారణాలవల్ల తెగుళ్ల వల్ల ఆశించిన స్థాయిలో పిందెలు రావడం లేదు. ఈ సమస్యలకు ఉద్యాన విశ్వవిద్యాలయం పరిష్కారం చూపాలని రాష్ట్ర ఉద్యాన శాఖ డైరెక్టర్ డా.కె. శ్రీనివాసులు, ఐఏఎస్ కోరారు. ఆయా జిల్లాల్లోని ఉద్యాన శాఖ అధికారులు, డా. వైయస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తల బృందంతో సమన్వయం చేసుకుంటూ రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని ఉద్యాన శాఖను ఆదేశించారు. ఈ మేధో మదన సదస్సులో, అధ్యక్ష ఉపన్యాసం చేసిన ఉపకులపతి డా. కె. ధనుంజయరావు మాట్లాడుతూ, ఎక్కువమంది రైతులు విచక్షణారహితంగా అధికమాతాధిలో మోతాదులో పురుగుమందులు వాడకం వల్ల తేనెటీగలు తగ్గిపోయి పుష్ప సంపర్కం జరగక, పూత పిందెగా మారడం లేదు, అంతేకాక రైతుకు పెట్టుబడి ఖర్చు పెరుగుతుంది. ముఖ్యంగా తెల్ల పూత దశ లో పురుగుమందులు అసలు కొట్టకూడదు. గతంలో కరోనా సమయంలో మామిడి పంటపై “పండుఈగ“ కారణంగా పండు కుళ్ళిపోతుంటే, డా. వైస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు చూపిన పరిష్కారం రైతులకు చాలా ప్రయోజనకరంగా ఉండింది.

అలాగే మామిడికాయలకు పరిపక్వ దశలోనే కవర్లు వాడుకోవడం ద్వారా నాణ్యమైన ఉత్పత్తి జరిగి పంటను అధిక ధరలకు అమ్ముకునే అవకాశం రైతులకు ఉంది. అంతేకాక రాష్ట్ర ప్రభుత్వం కవర్లు కొనుగోలు చేయడానికి సబ్సిడీ అందిస్తుంది.

అలాగే మామిడి సాగులో కల్తార్ వాడకం ఆపివేయాలి అని,

రాష్ట్ర ఉద్యాన కమిషనర్ సూచనల మేరకు ఉద్యాన విశ్వవిద్యాలయం ప్రత్యేక శాస్త్రవేత్తల బృందాన్ని ఏర్పరిచి ఆయా జిల్లాల ఉద్యాన శాఖ అధికారుల తో సమన్వయం చేస్తుందని, నాణ్యమైన మామిడి దిగుబడి వచ్చేలా రైతులకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తామని, ఉపకులపతి డా. కె ధనుంజయ రావు తెలియజేశారు.

ఈ సదస్సులో పరిశోధన సంచాలకులు డా.జి.రామానందం, విస్తరణ సంచాలకులు డా. సిహెచ్ రూత్, సీనియర్ శాస్త్రవేత్తలు డా. డి వెంకటస్వామి, డా. టి. పద్మలత, డా. బి. గోవిందరాజులు

## కమ్యూనిటీ హాలు మరమత్తు పనులకు ఎమ్మెల్యే వాసు శంకుస్థాపన

4 వ వార్డువార్డులో రూ, 4.50 కోట్ల పనులు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 20**

స్థానిక 4వ వార్డులో కమ్యూనిటీ హాలు మరమత్తు పనులకు సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ శంకుస్థాపన చేసారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే వాసు మాట్లాడుతూ గతంలో అన్ని వార్డుల్లో పేద బడుగు వర్గాల ప్రజల అవసరాల కోసం నిర్మించిన కమ్యూనిటీహాల్స్ ని గత వైసిపి ప్రభుత్వం అనాలోచిత నిర్ణయంతో సచివాలయాలుగా మార్చేసి ప్రజలకు ఇబ్బందులు సృష్టించిందని వాపోయారు. వేరే భవనాల్లోకి స్వర్ణ వార్డు కార్యాలయాలుగా తరలించినట్లు ఎమ్మెల్యే వాసు వివరించారు. ఈ కమ్యూనిటీ హాలుని మరమత్తులు చేయడానికి రూ. 23 లక్షలతో అంచనాలతో శంకుస్థాపన చేశామని తెలిపారు. కూటమి అధికారంలోకి వచ్చాక ఈ వార్డులో 42లక్షల 50వేల రూపాయల పనులు పూర్తిచేశామన్నారు. రూ .19లక్షల పనులు జరుగుతూ న్నాయన్నారు. ఇప్పుడు రూ 23లక్షల పనులకు శంకుస్థాపన చేశామన్నారు. కోటి 80లక్షలతో ఆర్ట్స్ కాలేజీ వరకు రోడ్డు వేసే పని త్వరలో చేపడతామన్నారు. పుష్కరాల పనులలో భాగంగా కోటి 60లక్షల పనులు చేపడతామని ఎమ్మెల్యే వాసు చెప్పారు. మొత్తంగా రూ 4న్నరకోట్లతో ఈ వార్డులో అభివృద్ధి పనులు ఆయన వివరించారు. తాడేపల్లిగూడెం పరిశీలకులు నక్కా చిట్టిబాబు మాట్లాడుతూ రూ 23లక్షల అంచనాతో పనులు చేయించడానికి శంకుస్థాపన చేయడం అభినందనీయమని వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాశీ నవీన్ కుమార్, దొండపాటి సత్యంబాబు, నక్కా దేవి వర ప్రసాద్, యాళ్ల శ్రీనివాసరావు, గూటాల సంజీవరావు, గుత్తుల రమేష్, అప్పిరెడ్డి కుమార్, కొండిశెట్టి రామకృష్ణ, బొట్టా వీరబాబు, లంక మణికంఠ, గుత్తుల లోకేష్, ఎం సత్యనారాయణ, కాంట్రాక్టర్ మార్గాని రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## సూరంపాలెంలో ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం



**గంగవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 19:**లోతట్టు ప్రాంతాలు గిరిజన ప్రాంతాల్లోని నిరుపేద రోగులకు ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎంపీపీ డాక్టర్ తీగల ప్రభ అన్నారు. గురువారం మండలంలోని సూరంపాలెంలో ఎన్టీఆర్ ట్రస్ట్ ప్రతినిధులు శ్రీకాంత్ కందుల సాయి రామకృష్ణ దొర ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని మాజీ ఎంపీపీ సందర్శించారు. ఈ సందర్భంగా వైద్యనిపుణులు డాక్టర్ ప్రసాద్ వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈనెల 20న జగ్గంపాలెం 21న కొత్తాడ 23 న మర్రిపాలెం 26న ఆమదాల బంధ 28న కుసుమురై గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నారాయణరావు, గోపాలకృష్ణ, వెంకటేశ్వర్లు, చిన్నయ్య, ఏఎన్ఎం కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**సీతానగరం, పెన్ పవర్, ఫిబ్రవరి 19:** సీతానగరం మండలంలోని సింగవరం నాగరత్నం కాలనీ రఘుదేవపురం గ్రామల పరిధిలో శుక్రవారం నుండి సోమవారం వరకు ఉదయం 10 గంటల నుంచి ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని రాజమహేంద్రవరం ఏ పి ఇ పి డి సి ఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నటరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా నటరాజ్ మాట్లాడుతూ అభివృద్ధి మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా గృహ వాణిజ్య వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని తెలిపారు. ఈ అసౌకర్యాన్ని గమనించి విద్యుత్ విభాగం వారికి సహకరించవలసిందిగా కోరారు.

## ఉమేష్ చంద్ర ఐపీఎస్ మెమోరియల్ క్రికెట్ టోర్నీ ప్రారంభించిన శుభం నోక్వల్





**కూనవరం,పెన్ పవర్,ఫిబ్రవరి 19.**ఉమేష్ చంద్ర ఐపీస్ మెమోరియల్ క్రికెట్ టోర్నీ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ క్రీడా మైదానం నందు చింతూరు ఐటీడీఏ పీవో శుభం నోక్వల్ ముఖ్య అతిధిగా విచ్చేసి చత్రపతి శివాజీ జయంతి సందర్భంగా కాసాయి జెండాను ఆవిష్కరించి,క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు.క్రీడా మైదానం నందు మొదటగా పిఓ శుభం నొక్వల్ బ్యాట్ పట్టి ఆటగాళ్లలో మనోధైర్యాన్ని నింపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటలు స్నేహపూర్వకంగా ఆడాలని, యువత ఆటలతో పాటు చదువులో కూడా రాణించాలని అన్నారు.మీ బంగారు భవిష్యత్తుకు మంచి మార్గాన్ని ఎంచుకోవాలని అన్నారు.విఆర్ పురం,చొప్పల్లి క్రీడాకారులను కరచాలం తో పరిచయం చేసుకున్నారు.క్రికెట్ టోర్నమెంట్ మొదటి విన్నర్ కు ప్రైజ్ మనీ 50వేలు,రెండవ విన్నర్ ప్రైజ్ మనీ 30వేలు అందజేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో కడబాల సుధ (విశ్వ హిందూ రామసేన ఇంచార్జ్,పోలవరం జిల్లా), టిడిపి మండల అధ్యక్షులు యడవల్లి భాస్కర్,బిజెపి నాయకులు పాయం వెంకయ్య, నోముల రామారావు,వైసీపీ నాయకులు ఆవుల మరియదాసు, సింజంట కంపెనీ యాలం రామకృష్ణ,గడ్డిపాటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## బడ్జెట్లో ఐ.సి.డి.ఎస్ కు నిధులు కేటాయించడంలో ప్రభుత్వం చిన్న చూపు.ఈ నెల 23 నుంచి రిలే నిరాహార దీక్షలకు సిద్ధం..

మార్చి 2న విజయవాడలో మహాధర్నా..



**అడ్డతీగల, పెన్ పవర్, ఫిబ్రవరి19:** స్థానిక మండల కేంద్రంలో ఐసిడిఎస్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకురాలు బి. నిర్మల మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వ వైఖరిపై జిల్లాలోని అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నా మన్నారు. ప్రధానంగా ఇటీవల అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన బడ్జెట్లో ఐసీడీఎస్ అభివృద్ధికి తగినన్ని నిధులు కేటాయించ లేదని, ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి నిరసనగా మార్చి 2న విజయవాడలో మహా ధర్నాకు సిద్ధపడుతున్నామని నిర్మల అన్నారు. అంతేకాకుండా కొన్ని నెలలుగా తమసమస్యలు పరిష్కరించాలంటూ విన్నవిస్తూనే ఉన్నా, ప్రభుత్వంలో చలనం లేకపోవడంతో ఉద్యమ బాటకు తెరలేపారు, ఇందులో భాగంగాఅంగన్వాడీ కార్యకర్తల డిమాండ్లు ఇవే...

నెలకు రూ.26 వేల చొప్పున కనీస వేతనం ఇవ్వాలి అని

1,810 మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా గుర్తించాలి అని,

వేతనంతో కూడిన మెడికల్ లీవ్ ఇవ్వాలి అని

అర్బన్, రూరల్ అనే తేడా లేకుండా సంక్షేమ పథకాలు అమలు చేయాలిఅని,

హెల్పర్లకు ప్రమోషన్లు ఇవ్వాలి164 సూపర్వైజర్ పోస్టులు భర్తీ చేయాలిఅని,

మే నెల అంతా వేసవి సెలవులు ఇవ్వాలిఅని,

లబ్దిదారులకు బియ్యం, నూనె, కందిపప్పు కోటా పెంచాలిఅని,

మెస్ చార్జీలు పెంచి, ఉచితంగా గ్యాస్ సరఫరా చేయాలిఅని,

ప్రీ స్కూల్ పిల్లలకు తల్లికి వందనం పథకం అమలు చేయాలిఅని, ఈనెల 23 నుంచి 27 వరకూ ప్రాజెక్ట్, జిల్లా స్థాయిలో రిలే నిరాహార దీక్షలు ప్రారంభిస్తామని నిర్మల తెలిపారు . అప్పటికీప్రభుత్వం స్పందించకపోతే మార్చి 2న విజయవా డలో మహాధర్నా చేపడతామన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

## సెంట్రల్ జైలు, మహిళా కారాగారాన్ని సందర్శించిన బోర్డ్ ఆఫ్ విజిటర్స్ బృందం



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 20**

స్తానిక సెంట్రల్ జైలు, మహిళా ప్రత్యేక కారాగారాన్ని సందర్శించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత, కలెక్టర్ కీర్తి చేకూరి, జిల్లా ఎస్పీ డి నరసింహ కిషోర్ తదితరులు సందర్శించారు.

గురువారం 'బోర్డ్ ఆఫ్ విజిటర్స్' బృందం రాజమండ్రి సెంట్రల్ జైలు, మహిళా ప్రత్యేక కారాగారాన్ని సందర్శించింది.

తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత నాయకత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ కీర్తి చేకూరి, జిల్లా ఎస్పీ డి నరసింహ కిషోర్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎన్. శ్రీలక్ష్మి ఇతర జిల్లా స్థాయి శాఖాధికారులు పాల్గొన్నారు. అధికారులు ఖైదీలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, యోగక్షేమాలు, సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సందర్శన సందర్భంగా ఖైదీలకు అందిస్తున్న భోజన వసతులు, బ్యారకుల పరిస్థితి, పరిశుభ్రత, జైలు ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, నైపుణ్య శిక్షణా కార్యక్రమాలు, ఉపాధి కల్పన పరిశ్రమలు, బేకరీ విభాగం, జైలు కిచెన్, లైబ్రరీ, ఖైదీల స్కూల్ తదితర విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. కలెక్టర్ కీర్తి చేకూరి స్వయంగా ఖైదీల భోజనాన్ని రుచి చూసి నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. జైలు కిచెన్ పరిశుభ్రత, ఆహార నాణ్యత, బ్యారకుల నిర్వహణ, హాస్పిటల్ సేవలపై బృందం ప్రశంసలు వ్యక్తం చేసింది. ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం అందుతున్న విధానం, బెయిల్స్ మంజూరు పరిస్థితి, షూరిటీ లేని ఖైదీలకు వ్యక్తిగత బెయిల్ కోసం కోర్టులో పిటిషన్ దాఖలు చేసే అవకాశాలపై జిల్లా ప్రధాన న్యాయమూర్తి మార్గదర్శకాలు ఇచ్చారు.ఖైదీలను కుల వివక్ష ఆధారంగా పనులు చేయిస్తున్నారా అనే అంశంపై విచారించగా, అలాంటి పరిస్థితులు లేవని ఖైదీలు తెలిపారు. జైలు ప్రాంగణంలోని పచ్చదనం, పరిశుభ్రత, క్రమశిక్షణ పట్ల బోర్డు సభ్యులు సంతృప్తి వ్యక్తం చేస్తూ, పెండింగ్ సమస్యల పరిష్కారానికి తగిన సూచనలు చేశారు. మహిళా ప్రత్యేక కారాగార పర్యవేక్షణాధికారిణి వసంత కుమారి, సిబ్బంది సమన్వయంతో జైలు సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని ప్రశంసించారు. పరిశుభ్రతకు సంబంధించిన జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డా. పి. భావన (చీఫ్ మెడికల్ ఆఫీసర్), బి. దిలీప్ కుమార్ (డిస్ట్రిక్ట్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్), ఎం.డి. ఘుజుద్దీన్ (జిల్లా సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్), కె. రాబర్ట్ పాల్ (జిల్లా అగ్రికల్చరల్ ఆఫీసర్), డా. ఇందిరా భారతి రాయ్ (మెడికల్ ఆఫీసర్), కారు సుభాషిణి (డిప్యూటీ జైలర్), బి. నాగమణి (డిప్యూటీ జైలర్) తదితరులు పాల్గొన్నారు.

## పర్యవేక్షణలేమితో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ అస్తవ్యస్తం-పరిసరాలు అపరిశుభ్రం





**ఏలూరు ఫిబ్రవరి 19 పెన్ పవర్** : అధికారుల పర్యవేక్షణ లేమితో గుండుగొలను సెక్టార్ పరిధిలోని ఆగడాల లంక గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది.

కేంద్రాలలో చిన్నారుల హజరు,వసతుల లేమి,పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. గ్రామంలో నాలుగు

అంగన్ వాడీ కేంద్రాలు ఉన్నాయి మూడు రెంట్ ఫ్రీ భవనాల్లో నడుస్తున్నాయి.

గ్రామంలోని అంగన్ వాడీ కేంద్రాలలో పోషణ్ వాటికలు కేంద్రాలకు దూరంగా ఉండగా,కొన్నింటిలో వాటికల నిర్వహణ లేదు.కేంద్రాలలో చిన్నారుల హజరు శాతం అంతంత మాత్రంగానే ఉంది.సెంటర్ 32లొ 12 మంది చిన్నారులు ఉండగా సగం మంది మాత్రమే కేంద్రానికి వస్తున్నారు. కేంద్రాలకు వచ్చిన చిన్నారులకు కేంద్రాల నిర్వాహకులు భోధన,ఆటపాటలు

నేర్పించడంలో అలసత్వం వహిస్తున్నారు.చిన్నారులు

ఎక్కువ సమయం విశ్రాంతి లోనే గడుపుతుండడం గమనార్హం.సంక్షమశాఖ చిన్నారుల పౌకర్యార్థం ఇచ్చిన బెంచీలు, ఆటపరికరాలు,కుర్చీలు వినియెగించకుండా నేలపై కూర్చోబెడుతున్నారు. ప్రాజెక్టు పరిధిలో కొన్ని కేంద్రాలకు ఇచ్చిన డిజిటల్ తెరలు వినియోగానికి నోచుకోవడం లేదు.అవి అలంకార ప్రాయంగా మారాయి.సెక్టార్ పరిధిలో అంగన్ వాడీ కేంద్రాలు పరిసరాలు అపరిశుభ్రతతో కూడి ఉన్నాయి.డ్రైనేజీలలో మురుగు పేరుకుపోయి, పారిశుధ్య కార్మికులు పట్టించుకోక పోవడంతో దుర్గంధం వెలువడి దోమలు పగటిపూట కూడా కేంద్రాలలో వీర విహారం చేస్తున్నాయి.కేంద్రాల పర్యలేక్షణాధి కారి చర్యలు తీసుకుని కేంద్రాల పనితీరు మెచుగుపరచాలని చిన్నారుల తల్లి తండ్రులు కోరుతున్నారు

## గుంటూరుకు ర్యాలీ గా వెళ్తున్న అంబటిని అడ్డుకున్న పోలీసులు



- బెయిల్ పై విడుదలై జక్కంపూడి ఇంట్లో బస
- నోటీసులు ఇచ్చిన నగర పోలీసుల వైఖరి పై మండిపడిన అంబటి
- ఎట్టకేలకు మూడు కార్లతో గుంటూరుకు ప్రయాణం

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 20:** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ను ఆసభ్యంగా తిట్టిన కేసు, 20 23లో సంక్రాంతి సంబరాల్లో లాటరీ టికెట్ల మోసం కేసులో స్థానిక సెంట్రల్ జైల్లో రిమాండ్ లో ఉన్న మాజీ మంత్రి, వైసిపి నాయకుడు అంబటి రాంబాబు బెయిల్ పై విడుదలైన అనంతరం బుధవారం వైసిపి శ్రేణులతో, కార్ల ర్యాలీతో గుంటూరుకు వెళ్లేందుకు యత్నాలను పోలీసులు అడ్డుకున్నారు. ఈ కేసులో మంగళవారం ఆయనకు బెయిల్ రాగా సెంట్రల్ జైలు నుంచి విడుదలయ్యి రాత్రి వైసిపి రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఇంటిలో బస చేశారు. అనంతరం బుధవారం ఉదయం 9 గంటలకు ఉభయ గోదావరి జిల్లాల నుంచి, గుంటూరు జిల్లా నుంచి అంబటి కి సంఘీభావంగా వచ్చిన వైసీపీ శ్రేణులతో కలిసి కార్ల ర్యాలీతో గుంటూరుకు వెళ్లేందుకు అంబటి రాంబాబు సిద్ధమయ్యారు. జక్కంపూడి ఇంటి నుంచి సుమారు 15 కార్లతో బయలుదేరగా శాంతి భద్రతల దృష్ట్యా మూడు కార్లకు మించి అనుమతులు లేవని సెంట్రల్ జోన్ ఇన్చార్జ్ డి.ఎస్.పి వైస్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో పోలీసులు అంబటిని అడ్డుకున్నారు. ఈ మేరకు ఆయనకు పోలీసులు నోటీసులు ఇచ్చారు. దాంతో కొద్దిసేపు అంబటి రాంబాబుకు మద్దతుగా నిలిచిన వైసీపీ శ్రేణులకు, పోలీసులకు మధ్య వాగ్వివాదంతో, వైసీపీ శ్రేణుల ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసుల వైఖరి పై అంబటి ఆగ్రహం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు , లోకేష్ డైరెక్షన్ లో పోలీసుల నిరంకుశంగా వ్యవహరి స్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బెయిల్ బుల్ కేసులో 18 రోజులు పాటు జైల్లో ఉండి బయటకు వచ్చిన తాను తన జిల్లా గుంటూరుకు శాంతియుతంగా వెళ్తున్నప్పుడు పోలీసులు అడ్డుకోవడం ఏంటని పోలీసు అధికారులను అంబటి ప్రశ్నించారు. కార్ల ర్యాలీని అడ్డుకుంటే తాను పాదయాత్ర గా నైనా వెళ్తానని భీష్మించారు. అయినప్పటికీ అనుమతి లేదని పోలీసులు స్పష్టం చేయడంతో ఎట్టకేలకు మూడు కార్లతో గుంటూరుకు అంబటి పయనమయ్యారు. మధ్యలో ఇతరుల కార్లు కలిసినప్పటికీ పోలీసులు ఎక్కడ ఎక్కడ నిరోధించారు.


03

ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో

కోర్టు పబ్లికేషన్ యాడ్స్

కేవలం

యాడ్ 500/-

'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'

'మరిన్ని వివరాలకు సంప్రదించండి '

93948 55244

షరతులు వర్తిస్తాయి


## అవినీతి నిరూపించకపోతే మీ కాళ్లు పట్టుకుని క్షమాపణ అడుగుతా



- నిరూపిస్తే మీరు దోచిన డబ్బు ప్రభుత్వానికి కడతారా.
- నేను సిద్ధం మీరు సిద్ధమా.
- జ్యోతుల నెహ్రూ,నవీన్ లకు సవాల్ విసిరిన పాఠంశెట్టి సూర్యచంద్ర.

**కిర్లంపూడి, పెన్ పవర్, ఫిబ్రవరి 19:** నియోజకవర్గంలో మీరు చేసిన అవినీతి నిరూపించకపోతే మీ కాళ్లు పట్టుకుని క్షమాపణ అడుగుతాను, నిరూపిస్తే మీరు దోసిన డబ్బు ప్రభుత్వానికి కడతారా అని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు, జిల్లా టిడిపి అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్ లకు నేను సిద్ధం మీరు సిద్ధమా అని జగ్గంపేట నియోజకవర్గం ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి పాఠంశెట్టి సూర్యచంద్ర సవాల్ విసిరారు. గురువారం కిర్లంపూడి మండలం బూరుగుపూడి గ్రామంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాఠంశెట్టి సూర్యచంద్ర మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జగ్గంపేటలో ఎన్నికల ప్రచారసభలో జగ్గంపేట నియోజకవర్గంలో విపరీతమైన మట్టి ఇసుక తోలకాలు జరిగాయని అవినీతి అనకొండలుగా మారి ప్రజాధనం దోచుకు తిన్నారని చెప్పడం జరిగిందన్నారు. అవినీతిపై ప్రశ్నించాలని,భయపడకుండా ధైర్యంగా అవినీతి చేసే వారిపై పోరాడి చేసిన అవినీతిని అందరికీ తెలిసే విధంగా ప్రజలందరూ తమ గళం వినిపించాలని తెలిపిన వీడియోని చూపిస్తూ నాటి ప్రభుత్వానికి నేటి ప్రభుత్వానికి తేడా ఎక్కడ అని జ్యోతుల నెహ్రూ, జ్యోతుల నవీన్ లను సూర్యచంద్ర ప్రశ్నించారు. ఈ రెండు సంవత్సరాల్లోనూ జగ్గంపేట నియోజకవర్గంలో మట్టి, ఇసుక అక్రమ రవాణాలో 200 కోట్లు పైనే అవినీతి జరిగిందని నిరూపించడానికి సిద్ధంగా ఉన్నామని నిరూపించ లేకపోతే జగ్గంపేట నడిబొడ్డున మీరు ఏర్పాటు చేసిన సమావేశంలో నేను మీ కాళ్లు పట్టుకొని క్షమాపణ చెప్పి రాజకీయాల నుండి తప్పుకుంటానని, మీరు చేసిన అవినీతి నిరూపించినట్లయితే మీరు దోచుకున్న ప్రజాధనాన్ని ప్రభుత్వానికి తిరిగి చెల్లించాలని పాటంశెట్టి సూర్యచంద్ర అన్నారు.రెవెన్యూ మైనింగ్ డిపార్ట్మెంట్ లతో మామిడాడ, కృష్ణవరం, గండేపల్లి, మురారి, నాయకంపల్లి, ఎన్ టి రాజాపురం, రంపయర్రంపాలెం, వీరలంకపల్లి ,బావాజీపేట, సూదికొండ, వేలంక ఇంకా అనేక గ్రామాలలో మట్టి, ఇసుక ఓవర్ లోడ్ లారీలు ప్రభుత్వ టోల్గేట్ లోకి వెళ్లకుండా బూరుగుపూడి కృష్ణవరం మధ్యలో పోలవరం, పుష్కర కాలువలనుండి రాత్రి పగలు తోలుతున్న మీ పర్సనల్ టోల్గేట్ ఆదాయం, ఏలేరులో ఇసుక అక్రమ రవాణా చేస్తున్న గ్రామాలలో ఇసుక తీసిన అన్ని ప్రాంతాలను స్వయంగా చూపించి అవినీతి నిరూపించడానికి మేము సిద్ధంగా ఉన్నామన్నారు. టైము డేటు ప్లేస్ శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ,జగ్గంపేట నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల నవీన్ నిర్ణయించుకుని తెలియచేయాలని పాటంశెట్టి సూర్యచంద్ర మీడియా ద్వారా కోరారు.

## పని ఒత్తిడి తగ్గించండి వీఆర్వోలు వినతి



**గండేపల్లి, పెన్ పవర్, ఫిబ్రవరి, 19:**పని ఒత్తిడి తగ్గించాలంటూ స్థానిక తాసిల్దార్ శ్రీనివాస్ కు గురువారం వీఆర్వో సంఘం అందించారు. ఈ సందర్భంగా వీఆర్వో సుబ్బారావు మాట్లాడుతూ జేఏసీ రాష్ట్ర పిలుపుమేరకు మెమొరం ఇవ్వడం జరుగుతుంది జరిగిందన్నారు. రీ సర్వే, సర్వేలు డ్యూటీలో ఉన్న విఆర్వోలకు అటెండెన్స్ సచివాలయంలోకి వెళ్లి డ్యూటీకి వెళ్లే పరిస్థితి ఎలా ఉందని ఎలా అయితే విఆర్వోలు విధులకు భారంగా ఉంటుందన్నారు. అథర్స్ ద్వారా ఇస్తే డ్యూటీలో ఉండి అటెండెన్స్ వేయవచ్చు అన్నారు. అంతేకాకుండా పని భారం అధికమవుతుందని జి ఎస్ డబ్ల్యు, మరియు రెవెన్యూ వర్కులు ఒకేసారి పనిచేయడం చాలా ఇబ్బందికరంగా ఉంటుందన్నారు. ఉన్నతాధికారులు దృష్టిలో పెట్టుకుని పని భారం తగ్గించే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. వీరి వెంట వీఆర్ఏలు సర్వేయర్లు వీఆర్వోలు పాల్గొన్నారు.

## బొబ్బా సత్యనారాయణమూర్తి సేవలు మరువలేనివి.



**ఆలమూరు, పెన్ పవర్, ఫిబ్రవరి 19;**ప్రజాసేవలో దివంగత బొబ్బా సత్యనారాయణమూర్తి సేవలు మరువలేనివని కోనసీమ జిల్లా పార్లమెంట్ కమిటీ కార్యనిర్వాహ కార్యదర్శి, ఆలమూరు సొసైటీ అధ్యక్షులు వంటిపల్లి సతీష్ పేర్కొన్నారు. బొబ్బా సత్యనారాయణమూర్తి 8 వర్ధంతి సందర్భంగా ఆలమూరు సొసైటీ కార్యాలయంలోనూ, జొన్నాడ జంక్షన్ వద్ద ఏర్పాటుచేసిన ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుప్త దాతగా పేరుగాంచిన బొబ్బా సత్యనారాయణమూర్తి మండలంలోని బొబ్బా చినవీరన్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, బొబ్బా జయశ్రీ జడ్పీ గర్ల్స్ హై స్కూల్, గ్రంథాలయం, ఆర్టీసీ బస్టాండ్లు వంటి పలు అభివృద్ధి పనులకు ఆయన చేసిన కృషి మరువలేనిది అన్నారు.అలాగే బడుగు బలహీన వర్గాల వారికి అయన అందించిన ఆర్థిక సహయ సహకారాలు మరువలేమని ఈ సందర్భంగా బొబ్బా సత్యనారాయణమూర్తి సేవలను ఆయన గుర్తు చేసుకున్నారు.

## మృతుల కుటుంబాలను పరామర్శించిన జనసేన పార్టీ ఇంచార్జ్ బండారు శ్రీనివాస్.



**ఆలమూరు, పెన్ పవర్, ఫిబ్రవరి 19;**మండలంలోని పెద్దపళ్ళ,నర్సిపూడి గ్రామాలలో మృతుల కుటుంబాలను కొత్తపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ బండారు శ్రీనివాస్ గురువారం పరామర్శించారు. పెద్దపళ్ళ గ్రామానికి చెందిన సీనియర్ జనసేన పార్టీ నాయకుడు గారపాటి త్రిమూర్తులు తండ్రి చిన్న చంటయ్య మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసి పితృవియోగంతో ఉన్న గారపాటి త్రిమూర్తులను పరామర్శించి ఓదార్చారు. అలాగే నర్సిపూడి గ్రామంలో ఇటీవల మృతి చెందిన లింగాల సూర్యనారాయణ కుటుంబ సభ్యులను బండారు శ్రీనివాస్ పరామర్శించారు. బండారు శ్రీనివాస్ వెంట నల్లా వెంకన్న,దున్నే స్వామినాయుడు, తోట వెంకటేశ్వర్లు,ఉన్నమట్ల బాలకృష్ణ,బైరిశెట్టి రాంబాబు, దేశభక్తుల సత్యనారాయణ, మాకి రెడ్డి బాబి, సిరిగినీడి పట్టాభి, గుత్తుల సురేష్,ఉండమట్ల దుర్గా ప్రసాద్, లింగాల నారయ్య, లింగాల గోవింద్, లింగాల పెద్ద, ఉండమట్ల అప్పారావు, ఎలుగుబంట్ల కనకయ్య, తదితరులు పాల్గొన్నారు.

## కొండపల్లి అప్పారావుకు మురళీకృష్ణంరాజు పరామర్శ.

**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, ఫిబ్రవరి 19**:శంఖవరం మండలం అన్నవరం గ్రామానికి చెందిన సీనియర్ వైసీపీ నాయకులు కొండపల్లి అప్పారావును ప్రత్తిపాడు నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గం పరిశీలకులు, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణ రాజు గురువారం పలకరించారు.కొండపల్లి అప్పారావు ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆరోగ్యం బాగోలేని కారణంగా ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న మురళీకృష్ణంరాజు గురువారం అప్పారావును పలకరించి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆ కుటుంబానికి ఏ కష్టం వచ్చినా అండగా ఉంటామని భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ దడాల సతీష్,వైస్ సర్పంచ్ బొబ్బిలి వెంకన్నబాబు ,తాటిపాక కృష్ణ ,వార్డు నెంబర్ గంపల సత్తిబాబు, పలివెల కొండలరావు,ఎం ఎస్,కొల్లు గణేష్ ,పలివెల ఈశ్వర్ రావు ,గంపల జయ గంగరాజు,కోలా తాతబాబు ,బొల్లు నాగేశ్వరరావు, జువ్వల దొరబాబు,దాడి పుత్రయ్య ,జువ్వల రాజు ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు

## ఇంత కంటే అవమానం ఉండదు: పసికూన ముందు పరువు పోగొట్టుకున్న పాకిస్తాన్, ఆస్ట్రేలియా..!




**హైదరాబాద్ పెన్ పవర్:** ఐసీసీ టీ20 వరల్డ్ కప్ 2026లో ఇటలీ పోరాటం ముగిసింది. ఈ పసికూన జట్టు గ్రూప్ దశలోనే నిష్క్రమించింది. తొలిసారి మెగా టోర్నీ ఆడిన ఇటలీ అంచనాలకు మించి రాణించింది. ఫస్ట్ టైమ్ వరల్డ్ కప్ ఆడుతున్నామనే టెన్షన్ లేకుండా బలమైన జట్లపై మెరుగైన ప్రదర్శనతో ఆకట్టుకుంది. అంతేకాకుండా ఒక విషయంలో ఇటలీ మాజీ చాంపియన్లు పాకిస్తాన్, ఆస్ట్రేలియా కంటే మెరుగ్గా ఉంది.

అదే గ్రూప్ దశలో అత్యధిక సిక్సర్లు కొట్టడం. గ్రూప్ దశలో భాగంగా నాలుగు మ్యాచులు ఆడిన ఇటలీ మొత్తం 34 సిక్సర్లు కొట్టింది. గ్రూప్ దశలో అత్యధిక సిక్సర్లు బాదిన జాబితాలో ఇటాలియన్ టీమ్ నాలుగో స్థానంలో నిలిచింది. ఇదే సమయంలో పాకిస్థాన్ 28, ఆస్ట్రేలియా 14 సిక్సర్లతో ఇటలీ కంటే వెనుకంజలో ఉండటం గమనార్హం.ఈ జాబితాలో 40 సిక్సర్లతో టీమిండియా అగ్రస్థానంలో నిలిచింది. 33 సిక్సర్లతో మరో పసికూన అమెరికా ఈ జాబితాలో నాలుగో స్థానంలో నిలవడం విశేషం. మాజీ ప్రపంచ విజేతలైనా ఆస్ట్రేలియా, పాకిస్తాన్ పసికూనలు ఇటలీ, అమెరికా కంటే తక్కువ సిక్సర్లు కొట్టడంపై క్రికెట్ ఫ్యాన్స్ సెటైర్లు వేస్తున్నారు. ఇంత కంటే అవమానం మరొకటి ఉండదని.. పసికూనలు ముందు పాకిస్తాన్, ఆస్ట్రేలియా పరువు పోగొట్టుకున్నాయని కామెంట్స్ చేస్తున్నారు. చెత్త ప్రదర్శనతో మాజీ చాంపియన్ ఆస్ట్రేలియా ఈ వరల్డ్ కప్?లో గ్రూప్ దశనలోనే నిష్క్రమించిన విషయం తెలిసిందే.

**ఐసీసీ 2026 టీ20 వరల్డ్ కప్ గ్రూప్ దశలో ఎక్కువ సిక్సులు కొట్టిన జట్లు:**

భారతదేశం – 40 సిక్సులు
ఇంగ్లాండ్ – 36 సిక్సులు
వెస్టిండీస్ – 36 సిక్సులు
ఇటలీ – 34 సిక్సులు
యూఎస్ఏ – 33 సిక్సులు

# సూపర్--8కి భారత్ జట్టులో మార్పులు?.. ప్లేయర్లకు సునీల్ గవాస్కర్ కీలక సూచనలు




**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 వరల్డ్ కప్ 2026లో భాగంగా జరిగే సూపర్--8 దశలోకి భారత జట్టు అడుగుపెట్టింది. ఫిబ్రవరి 22వ తేదీన అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో దక్షిణాఫ్రికాతో తొలి సూపర్--8 మ్యాచ్‌లో టీమిండియా తలపడనుంది. ఈ కీలక మ్యాచ్‌కు ముందు భారత ప్లేయింగ్ ఎలెవన్‌పై పెద్ద ఎత్తున చర్చలు కొనసాగుతున్నాయి. జట్టులో మార్పుపై మాజీ క్రికెటర్ సునీల్ గవాస్కర్ మాత్రం టీమ్‌లో కేవలం ఒకే ఒక్క మార్పు జరిగే అవకాశం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. రెస్ట్ తీసుకున్న అక్షర్ పటేల్ సూపర్--8 మ్యాచ్‌లో తప్పకుండా తుది జట్టులోకి వస్తాడు అని ధీమా వ్యక్తం చేశాడు. అతని కోసంఅర్ష్‌దీప్ సింగ్ ని బెంచ్‌కు పరిమితం చేసే ఛాన్స్ ఉందని పేర్కొన్నాడు. ఇటీవల నెదర్లాండ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో తొలిసారి వరల్డ్ కప్‌లో ఆడిన వాషింగ్టన్ సుందర్ నాలుగు ఓవర్లలో వికెట్ తీయకపోయినా, లోయర్ ఆర్డర్ లో బ్యాటింగ్ అవసరం కాబట్టి, అతడికి మరో అవకాశం దక్కే సూచనలు కనిపిస్తున్నాయని సునీల్ గవాస్కర్ తెలిపారు. అహ్మదాబాద్ పిచ్ స్పిన్‌కు పెద్దగా సహకరించదనే కారణంతో కుల్దీప్ యాదవ్ కు ఈ మ్యాచ్‌లో కూడా ఛాన్స్ దక్కకపోవచ్చని పేర్కొన్నారు. గతంలో సౌతాఫ్రికాతో జరిగిన టీ20 సిరీస్‌లలో కూడా కుల్దీప్ ఎక్కువ మ్యాచ్‌లు ఆడలేదని సన్నీ గుర్తు చేశారు. వాషింగ్టన్ సుందర్ 8వ స్థానంలో కూడా బ్యాటింగ్ చేయగలడు.. బంతిని బౌండరీకి తరలించే సామర్థ్యం అతడికి ఉంది.. అదే వాషికి ప్లస్ పాయింట్.. కాబట్టి అర్షదీప్ స్థానంలో అక్షర్ రావడం ఒక్కటే మార్పుగా నేను భావిస్తున్నాను అని మాజీ క్రికెటర్ గవాస్కర్ స్పష్టం చేశాడు. ఇదిలా ఉండగా, వరుసగా మూడు సార్లు డకౌట్స్ తో తీవ్రంగా నిరాశపరిచిన అభిషేక్ శర్మకు కీలక సూచనలు చేశాడు. భారీ షాట్లు కొట్టాలనే ఒత్తిడిని తగ్గించుకుని, ఎక్కువ సేపు క్రీజ్‌లో ఉండేందుకు ప్రయత్నం చేయాలని తెలిపాడు. ఫస్ట్ బాల్ నుంచే సిక్స్ లేదా ఫోర్ కొట్టాలని ప్రయత్నించాల్సిన అవసరం లేదన్నాడు.. ఒక సింగిల్ తీసుకుని ఖాతా తెరవాలి.. నాలుగు డాట్ బాల్స్ వచ్చినా పరవాలేదు.. ఆ తర్వాత వాటిని డాట్ అయినా బాల్స్ ని కవర్ చేయగల సత్తా అభిషేక్ కి ఉందని సన్నీ వెల్లడించారు. సూపర్--8 దశలో ప్రతి మ్యాచ్ కీలకం కావడంతో.. భారత్ తీసుకునే నిర్ణయాలు అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. దక్షిణాఫ్రికాతో జరిగే ఈ మ్యాచ్‌లో టీమిండియా ఏ కాంబినేషన్‌తో బరిలోకి దిగుతుందో వేచి చూడాలి..

## శ్రీలంక జట్టును చిత్తు చేసిన పసికూన జింబాబ్వే..





**హైదరాబాద్ పెన్ పవర్:** 20 ప్రపంచ కప్ 2026 గ్రూప్--దీలో భాగంగా కొలంబోలోని ఆర్. ప్రేమదాస స్టేడియంలో శ్రీలంకతో జరిగిన మ్యాచ్ లో జింబాబ్వే ఘన విజయం సాధించింది. 6 వికెట్ల తేడాతో సికందర్ రజా సేన గ్రాండ్ విక్టరీ సాధించింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 178 పరుగులు చేసింది. లంక బ్యాటర్లలో పాతుమ్ నిస్సాంక (62) ఒక్కడే హాఫ్ సెంచరీ చేయగా.. చివర్లో జట్టు భారీ స్కోర్ సాధించడంలో పవన్ రత్నాయకే (44) కీలక ఇన్నింగ్ ఆడాడు. కుశాల్ పెరీరా (22) ఫర్వాలేదనిపించిన మిగతా బ్యాటర్లు అందరు దారుణంగా విఫలమయ్యారు. శ్రీలంక జట్టులోని మిగతా బ్యాటర్లు కుశాల్ మెండిస్ (14) కమిందు మెండిస్ (7), కెప్టెన్ దాసున్ షనకా (6), దుషన్ హేమంత (0) క్రీజులోకి ఇలా వచ్చి అలా వెళ్లిపోయారు. చివరి ఓవర్ లో దునిత్ వెల్లలాగే రెండు ఫోర్లు కొట్టడంతో శ్రీలంక 7 వికెట్ల నష్టానికి 178 పరుగులు చేయగలిగింది. దీంతో జింబాబ్వే బౌలర్లలో గ్రేమ్ క్రీమర్, బ్లెస్సింగ్ ముజారబానీ, బ్రాడ్ ఎవాన్స్ తలో రెండు వికెట్లు పడగొట్టగా, ర్యాన్ బర్ల్ ఒక వికెట్ తీసుకున్నాడు. లక్ష్య ఛేదన కోసం బరిలోకి దిగిన జింబాబ్వే జట్టు ప్రారంభం నుంచే లంక బౌలర్లపై ఎదురుదాడికి దిగింది. జింబాబ్వే ఓపెనర్లు తాడివానాషే మారుమణి, బ్రియాన్ బెన్నెట్ దుకుడుగా బ్యాటింగ్ చేయడంతో టార్గెట్ తగ్గిపోయింది. 69 పరుగుల వద్ద తడివానాషే మరుమాని (34) మొదటి వికెట్ గా డగౌట్ కి వెళ్లిన తర్వాత మైదానంలోకి వచ్చిన ర్యాన్ బర్ల్ సైతం 12 బంతుల్లో 23 పరుగులు చేసి 98 పరుగుల దగ్గర ఔట్ అయ్యాడు.

అనంతరం క్రీజులోకి వచ్చిన సికందర్ రాజా కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడాడు. జస్ట్ 26 బంతుల్లోనే 2 ఫోర్లు, 4 సిక్సులతో 45 పరుగులు చేసి దుషన్ హేమంత బౌలింగ్ లో భారీ షాట్ ఆడే ప్రయత్నంలో దాసున్ షనకాకి క్యాచ్ ఇచ్చి పెవిలియన్ బాట పట్టాడు. ఆ తర్వా బ్యాటింగ్ కి వచ్చిన తషింగా ముసేకివా ఎక్కువ సేపు క్రీజులో నిలవలేక ఔట్ అయ్యాడు. మరో ఓపెనర్ బ్రియాన్ బెన్నెట్ మిడిల్ ఆర్డర్ లో బ్యాటింగ్ కి వచ్చిన టోనీ మున్యోంగా కలిసి జట్టును గెలిపించాడు.

# టైర్ 2 హీరోల్లో బోర్డర్ దాటేసింది వీరే!



**కుశిత కల్లపు గ్రేస్‌ఫుల్ గ్లామ్‌లో మెరుస్తుంది**



పాన్ ఇండియా సినిమాల ప్రభావం మొదలైన దగ్గరి నుంచి టాలీవుడ్ హీరోల్లో అత్యధిక శాతం మందిని ఓ ప్రశ్న వెంటాడుతోంది. అదే వంద కోట్ల క్లబ్‌లో చేరే సినిమా ఎప్పుడని. చిన్న చిన్న హీరోలు సైతం తమ సినిమాలతో వంద కోట్ల మార్కుని దాటేస్తుంటే వారి కంటే ముందు ఇండస్ట్రీలోకి ప్రవేశించిన హీరోలు ఆ మార్కుని..ఆ బోర్డర్‌ని దాటేయలేకపోతున్నారు. ఒక్కటంటే ఒక్క సినిమా అయినా పడుతుందా? దాంతో ఆ బోర్డర్‌ని దాటేయలేకపోతామా అని ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

**ఈ బోర్డర్‌ని ముందు దాటేసిన హీరో...**

ఇప్పటికే బాక్సాఫీస్ వద్ద వంద కోట్ల మార్కు బోర్డర్‌ని చాలా సింపుల్‌గా దాటేసి దానికి మించిన వసూళ్లని రాబోయే సినిమాలతో సాధించాలని కొంత మంది హీరోలు ఆశగా అడుగులు వేస్తున్నారు. టైర్ 2 హీరోల్లో ఈ బోర్డర్‌ని ముందు దాటేసిన హీరో రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ. పరశురామ్ డైరెక్ట్ చేసిన –గీత గోవిందం– సినిమాతో వంద కోట్ల క్లబ్‌లో చేరిన విషయం తెలిసిందే. బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలిచిన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద రూ.132 కోట్లు వసూలు చేసి ఫస్ట్ టైమ్ రౌడీ సత్తా ఏంటో చూపించింది.అప్పటి నుంచి మళ్లీ వంద కోట్లు రాబట్టే సినిమా కోసం శ్రమిస్తున్నా విజయ్‌కి వర్కవుట్ కావడం లేదు. ఆ తరువాత రేసులో నిలిచింది మెగా హీరో పంజా వైష్ణవ్ తేజ్. హీరోగా పరిచయమైన ఫస్ట్ మూవీ –ఉప్పెన–. బుచ్చిబాబు సాన డైరెక్షన్‌లో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించిన ఈ మూవీ బ్లాక్ బస్టర్ టాక్‌తో వంద కోట్ల మార్కుని చేరింది. దానికి మించి వైష్ణవ్ తేజ్ ట్రై చేస్తున్నా ఫ్లాపులే ఎదురవుతున్నాయి. తన తరువాత మూడు సినిమాలతో రేసులో ముందు వరుసలో నిలిచిన హీరో నేచురల్ స్టార్ నాని. –దసరా– మూవీతో ఫస్ట్ టైమ్ వంద కోట్ల క్లబ్‌లో చేరిన నాని ఆ తరువాత –సరిపోదా శనివారం, హిట్ 3లతో బ్యాక్ టు బ్యాక్ వంద కోట్లకు మించి వసూళ్లని రాబట్టిన హీరో అనిపించుకున్నాడు.ఈ రేసులో నిఖిల్ కూడా చేరాడు. తను నటించిన మిస్టరీ యాక్షన్ అడ్వెంచర్ –కార్తికేయ 2–తో ఈ ఫీట్‌ని అందుకున్నాడు. ఈ మూవీ రూ.120 కోట్లకు పైనే రాబట్టింది. మాస్ మహారాజా రవితేజ కూడా –ధమాకా– మూవీతో ఈ క్లబ్‌లో చేరాడు. యాక్షన్ కామెడీ డ్రామాగా త్రినాథరావు నక్కిన తెరకెక్కించిన ఈ మూవీ రూ.110 కోట్లు రాబట్టింది. స్టార్‌బాయ్ సిద్ధూ జొన్నలగడ్డ –టిల్లూ స్క్వేర్–తో ఆ ఫీట్‌ని పూర్తి చేశాడు. త సినిమా రూ. 135 కోట్ల వసూళ్లని అందించింది. నాగచైతన్య కూడా నేను సైతం అన్నట్టుగా –తండేల్–తో రూ.100 కోట్లు రాబట్టి ఈ క్లబ్‌లో స్థానం దక్కించుకున్నాడు.

**రేసులో లేని హీరో ఖాతాలో రెండు...**

చైల్డ్ ఆర్టిస్ట్‌గా సినీరంగంలో ఎన్నో సినిమాలు చేసిన తేజ సజ్జ –ఓ బేబీ– సినిమాతో యంగ్ యాక్టర్‌గా అందరి దృష్టిని ఆకర్షించాడు. సమంత టైటిల్ పాత్రలో నటించిన ఈ మూవీ సక్సెస్ కావడంతో –జాంబిరెడ్డి–తో హీరోగా ఎంట్రీ ఇచ్చాడు. ఆ తరువాత ఇష్క్, అద్భుతం అంటూ రెండు సినిమాలు చేసినా ఫలితం లేకుండా పోయింది. దీంతో ప్రశాంత్ వర్మతో కలిసి –హనుమాన్– అంటూ షాక్ ఇచ్చాడు. భారీ బడ్జెట్‌తో రూపొందిన ఈ సినిమా బ్లాక్ బస్టర్ అనిపించుకుని బాక్సాఫీస్ వద్ద రూ.296 కోట్లు రాబట్టి అందరిని ఆశ్చర్యపరిచింది. ఈ మూవీ అందించిన జోష్‌తో కొత్త కథలనే ఎంచుకోవాలన్న నిర్ణయానికి వచ్చిన తేజ –మిరాయ్– అంటూ ప్రేక్షకుల ముందుకొచ్చాడు. ఇది కూడా సక్సెస్ అయి రూ.140 కోట్లకు మించి వసూళ్లని రాబట్టడంతో బ్యాక్ టు బ్యాక్ వంద కోట్లకు మించి వసూళ్లని రాబట్టిన హీరోగా సరికొత్త రికార్డు సాధించాడు. త్వరలో –జై హనుమాన్–తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు.

**వంద కోట్లు దాటని హీరోలు...**

మాస్ మహారాజా రవితేజ నుంచి తేజ సజ్జ వరకు టైర్ 2 హీరోల్లో చాలా వరకు వంద కోట్ల బోర్డర్‌ని దాటేయడంతో ఇప్పుడు మిగిలిన హీరోలపై చర్చ మొదలైంది. ఈ మార్కుని ఇప్పటి వరకు రామ్ పోతినేని, శర్వానంద్, గోపీచంద్, అల్లరి నరేష్, రానా దగ్గుబాటి (సోలో హీరోగా), అడివి శేష్, నితిన్, బెల్లంకొండ సాయి శ్రీనివాస్, సాయి ధరమ్‌తేజ్, వంటి హీరోలున్నాయి. ఈ ఫీట్‌ని సాయి ధరమ్ తేజ్ –విరూపాక్ష– మూవీతో దాటేస్తాడని అనుకున్నారు కానీ ఆ మూవీ రూ.90 కోట్లు మాత్రమే రాబట్టడంతో తను వంద కోట్ల క్లబ్‌లో చేరలేకపోయాడు. మిగిలిన టైర్ 2 హీరోల్లో రామ్ నుంచి రానా వరకు అవకాశం ఉన్న అందుకు తగ్గ సినిమాలు పడటం లేదు. వన్స్ పడితే వంద బోర్డర్ ఈజీగా దాటేస్తారు.



**నువేక్ష తన సహజమైన ఆకర్షణ మరియు స్క్రీన్ ప్రెజెన్స్‌తో స్టన్ చేస్తుంది**

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers, Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 1-17-1, Badeti Ramana Street, Near Mla House, 30th Word, Thadepalligudem , Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2834, E-Mail : Editorpenpower@Gmail.Com, Mobile: 9059465965